


హంద్రీనీవా కాలువపై పూర్తికాని బ్రిడ్జి నిర్మాణం


తలుపుల మండలంలో పూర్తికాని హంద్రీనీవా కాలువ సొరంగం

5 ఏళ్లలో శాతం కూడా చేయలే..!

కదిరి, సెప్టెంబరు 26: కదిరి ప్రాంత ప్రజల ఆశలపై గత వైసీపీ ప్రభుత్వం నీళ్లు చల్లింది. హంద్రీనీవా కాలువ నిర్మాణాన్ని అటకెక్కించింది. అడుగు కూడా పనులు చేపట్టలేదు. గత టీడీపీ హయాంలో మిగిలిపోయిన కేవలం ఐదుశాతం పనులను కూడా పూర్తిచేయకుండా నిర్లక్ష్యం చూపారు గత వైసీపీ పాలకులు. ఎక్కడివక్కడే వదిలేశారు. పట్టించుకున్న నాథుడే లేడు. వారి పాపం.. కదిరి ప్రాంతవాసులకు శాపంగా మారింది. తాగు, సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. గత టీడీపీ హయాంలో నియోజకవర్గంలో కాలువ పనులు దాదాపు పూర్తయ్యాయి. అక్కడక్కడా టన్నెల్ పనులు మాత్రమే మిగిలిపోయాయి. దీంతో త్వరలోనే కృష్ణాజలాలు వస్తాయనీ, ఈ ప్రాంతం కరువు తీరుతుందని రైతులు, ప్రజలు ఆశించారు. ఇంతలోనే 2019 ఎన్నికలొచ్చాయి. వైసీపీ అధికారం చేపట్టింది. ఆ తర్వాత కాలువ పనుల ఊసేలేదు. మిగిలిపోయిన చిన్నచిన్న పనులను కూడా చేపట్టలేదు. దీంతో వైసీపీ పాలన ఐదేళ్లూ రైతులు, ప్రజలకు నిరాశే మిగిలింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో ఈ ప్రాంత ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. మిగిలిపోయిన కాలువ పనులను పూర్తిచేసి, త్వరలోనే నీరిస్తారని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఆ దిశగా అప్పుడే చర్యలు మొదలైనట్లు తెలుస్తోంది. పనులకు సంబంధించి రూ.160 కోట్లతో ప్రతిపాదనలను సిద్ధం చేయడం పట్ల కదిరి ప్రాంత ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

ప్రకటనలకే పరిమితం

కదిరి అత్యంత తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రాంతం. పంటలు పండవు. చదువుకున్నవారు, చదువురానివారు అందరూ బతుకుదెరువు కోసం వలసబాట పడుతున్నారు. ఇలా చాలా ఊళ్లు ఖాళీ అయ్యాయి. ఈప్రాంతం సస్యశ్యామలం కావాలంటే హంద్రీనీవా ద్వారా కృష్ణాజలాలను తీసుకురావాలి. పదేళ్ల క్రితం హంద్రీనీవా ఈ ప్రాంతానికి వచ్చినా, కొన్ని మండలాలకే పరిమితమైంది. కదిరి, నల్లచెరువు, తనకల్లు ప్రాంతంలో టీడీపీ పాలనలో కొన్ని చెరువులు నింపారు. తరువాత వైసీపీ ప్రభుత్వం ఒక్కచెరువును కూడా హంద్రీనీవా కాలువతో అనుసంధానం చేయలేదు. ముదిగుబ్బ మండలంలోని నాగిరెడ్డిపల్లి నుంచి ప్రారంభమయ్యే ప్రధాన కాలువ పనులు కూడా పూర్తికాలేదు. గత ఐదేళ్లలో ఐదుశాతం పనులు కూడా చేయలేదు. దీంతో తలుపుల, నంబులపూలకుంట మండలాలకు తాగు, సాగునీరు కరువైంది. గాండ్లపెంట మండలానికి లిఫ్టు ఇరిగేషన్ ద్వారా హంద్రీనీవా నీటిని అందిస్తామని నాయకులు చెప్పిన మాటలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. హంద్రీనీవా ద్వారా నీరు వస్తేనే ఈప్రాంతంలో తాగు, సాగునీరు కొరత తీరుతుంది. దీనికోసం 15సంవత్సరాలుగా ఎదురు చూస్తున్నారు.

చెరువులకు నీరు అందేనా?

గత టీడీపీ హయాంలో చిత్తూరు జిల్లాలోని కుప్పం వరకు, ఇటు అన్నమయ్య జిల్లా రాయచోటి, పీలేరుకు హంద్రీనీవా ద్వారా కృష్ణాజలాలను తరలించడానికి కాలువలు తవ్వారు. అందులో భాగంగా కదిరి నియోజకవర్గంలోని చెర్లోపల్లి వద్ద రిజర్వాయర్‌ను నిర్మించారు. హంద్రీనీవా ప్రధాన కాలువ పనులు కూడా ఐదుశాతం మినహా పూర్తయ్యాయి. ఆ పనులు గత వైసీపీ ప్రభుత్వం పూర్తి చేసిఉండుంటే నియోజకవర్గమంతా హంద్రీనీవానీరు అందేది. ఇప్పటివరకు కదిరి, నల్లచెరువు, తనకల్లు నాలుగైదు చెరువులకు మినహా ఎక్కడా నీరు అందించలేదు. ప్రధాన కాలువ ద్వారా తలుపుల, నంబులపూలకుంట మండలాల్లో అన్ని చెరువులకు నీరు అందే అవకాశం ఉంది. గొలుసు కట్టు పద్ధతిలో ఈ రెండు మండలాలకు నీరు అందిస్తే రైతులకు ఎంతో ఉపయోగంగా ఉండేది. ఈప్రాంతంలో అధికంగా ఉన్న బంజరు భూమి సాగులోకి వచ్చేది. సాగు, తాగునీటికి కొరత ఉండేదికాదు. ఆవైపు దృష్టి పెట్టలేదు.

జీవో ఇచ్చినా..

నియోజకవర్గం మధ్యలో గాండ్లపెంట మండలం ఉంది. మండలానికి నీరు రావాలంటే లిఫ్టు పద్ధతే మార్గం. గత వైసీపీ పాలకులు.. లిఫ్టు పద్ధతిలో తనకల్లు మండలం నుంచి గాండ్లపెంటకు నీరు ఇస్తామని హామీ ఇచ్చారు. జీవోలు జారీ చేసి, పనులు మాత్రం చేపట్టలేదు. నిధులివ్వకపోవడంతో అది కాగితాలకే పరిమితమైంది.

అడుగంటిన భూగర్భజలాలు

నియోజకవర్గవ్యాప్తంగా అన్ని మండలాల్లో భూగర్భజలాలు అడుగంటుతున్నాయి. ఈసంవత్సరం ఆశించినంత వర్షం కురవకపోవడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. ఖరీఫ్ సీజన్‌లో బోరుబావుల కింద రైతులు వరి సాగు చేశారు. ప్రస్తుతం పంట గింజపట్టే దశలో ఉంది. ఈ నేపథ్యంలో బోరుబావుల నుంచి సాగునీరు అరకొరగా వస్తోంది. ఆ నీటితో పంటను కాపాడుకునేందుకు రైతులు తిప్పలు పడుతున్నారు. హంద్రీనీవా నీరు నియోజకవర్గానికి వస్తేనే బోరు బావుల్లో నీటి మట్టాలు పెరిగే అవకాశం ఉందని రైతులు అంటున్నారు. కూటమి ప్రభుత్వం హంద్రీనీవా నీటిని కదిరి నియోజకవర్గానికి తీసుకురావాలని కోరుతున్నారు.

హంద్రీనీవాపై గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం
కాలువ పనులు అడుగు కూడా చేపట్టని దుస్థితి
కదిరి ప్రాంతానికి తీవ్ర అన్యాయం

తీరనున్న నీటి కొరత



హంద్రీనీవా కాలువ ద్వారా నీరిస్తే మండలంలో తాగు, సాగునీటి కొరత తీరుతుంది. వంకమద్ది చెరువు నింపితే ఆయకట్టుతోపాటు, బోరు బావుల్లో నీటిమట్టం పెరుగుతుంది. చెరువుకింద ఆరెకరా భూమి ఉంది. బోరు కింద మూడు ఎకరాలుంది. బోరుబావిలో నీరు తగ్గడంలో పంటలు సాగు చేయలేదు.

- నరసింహులు, వంకమద్ది, నంబులపూలకుంట మండలం


హంద్రీనీవా కాలువలో పిచ్చిమొక్కలు

హంద్రీనీవాతోనే సస్యశ్యామలం



తలుపుల, నల్లచెరువు నుంచి లిఫ్టు పద్ధతిలో మండలానికి నీరివ్వచ్చు. తద్వారా భూగర్భ జలం పెరుగుతుంది. పంటలసాగు పెరిగి, ఈప్రాంతం సస్యశ్యామలం అవుతుంది.

- ఈశ్వర్‌రెడ్డి, రైతు, వద్దిరెడ్డిపల్లి, గాండ్లపెంట మండలం

గుర్రాల కోటను కూల్చేస్తాం

■ మంత్రి సత్యకుమార్ యాదవ్


మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

తాడిమర్రి, సెప్టెంబరు 26: ధర్మవరం చెరువును ఆక్రమించి మాజీ ఎమ్మెల్యే (కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి) కట్టుకున్న గుర్రాల కోటను కూల్చేస్తామని రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలో గురువారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ... ప్రజల సొమ్మును కొల్లగొట్టి మాజీ ఎమ్మెల్యే చెరువు మధ్యలో విలాసవంతమైన గుర్రాల కోట కట్టారన్నారు. దానిని కూలగొట్టి తీరతామన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేర్చుతోందన్నారు. అధికారం చేపట్టిన నెలరోజుల్లోపే సామాజిక పింఛన్ సొమ్ము రూ.4 వేలకు పెంచడం, 16వేల పోస్టులతో మెగా డీఎస్సీని ప్రకటించడం, రాష్ట్రవ్యాప్తంగా 203 అన్న క్యాంటీన్లను తెరవడం, పోలవరం, రాష్ట్ర రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్రం నుంచి నిధులు రాబట్టడం, గ్రామపంచాయతీల అభివృద్ధికి రూ.1500 కోట్లు విడుదల చేయడం చూశాక కూటమి ప్రభుత్వాన్ని మంచి ప్రభుత్వం అనరా అని ప్రజలను అడిగారు. తాడిమర్రిలో అక్రమంగా రోడ్డు విస్తరణలో తొలగించిన ఇళ్ల లబ్ధిదారులు, సీబీఆర్ నిర్వాసితులకు పరిహారం అందజేస్తామన్నారు. జలజీవన్ మిషన్ కింద ఇప్పటికే రూ.8.50 కోట్లు మంజూరయ్యాయన్నారు. మరో రూ.7.50 కోట్లకు ప్రతిపాదనలు సిద్ధం చేశామన్నారు. ఆ నిధులతో తాడిమర్రి మండల ప్రజల దాహార్తి తీర్చుతామన్నారు. మండలంలోని పిన్నదరి గ్రామ పంచాయతీని దత్తత తీసుకున్నానన్నారు. బాధ్యతలు చేపట్టి వంద రోజులు పూర్తయినా తాడిమర్రి మండలానికి రాకపోవడం తన తప్పు అనీ, అందుకు ప్రజలు క్షమించాలని మంత్రి కోరారు. ఆ తరువాత రాష్ట్ర సీడ్స్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ఎంపికైన కమతం కాటమయ్యను మంత్రి సన్మానించారు. అంతకుమునుపు ఆర్‌బీకే వద్ద మొక్కలు నాటారు. తాడిమర్రి నుంచి తిరుగు ప్రయాణంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ నారసింపల్లిలోని జేవీఎం ఆర్డీఎఫ్ పాఠశాలను సందర్శించారు. పాఠశాల మేనేజింగ్ ట్రస్టీ మాజీ డీజీపీ రాముడును మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకటరామిరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖాధికారి సుబ్బారావు, జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి, మండల కన్వీనర్ కూచిరాము, ఉమ్మడిజిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్, నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

పుట్టపర్తి, సెప్టెంబరు 26: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ టీఎస్ చేతన్.. సంబంధిత అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం జిల్లాస్థాయి సెటిల్మెంట్, రోడ్డు సేఫ్టీ కమిటీ సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. మద్యం సేవించి, హెల్మెట్ లేకుండా డ్రైవింగ్ చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ శ్రీనివాసులు, రవాణాశాఖ అధికారి కరుణ సాగర్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి మంజువాణి, రోడ్లు భవనాల శాఖ ఎస్‌ఈ సంజీవరావు, జాతీయ రహదారుల ఈఈ భరత్, ఎంవీఐ శ్రీనివాసులు పాల్గొన్నారు.

పలువురు ఆర్డీఓల బదిలీ

పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 26: జిల్లాలో పలువురు ఆర్డీఓలను బదిలీ చేస్తూ రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ గురువారం రాత్రి ఉత్తర్వులు జారీచేశారు. కదిరి ఆర్డీఓ వంశీకృష్ణను బదిలీ చేశారు. ఆ స్థానంలో పాడేరు ట్రైబల్ వెల్ఫేర్ అధికారిగా పనిచేస్తున్న వెంకటసన్యాసి శర్మను నియమించారు. ఖాళీగా ఉన్న పెనుకొండ ఆర్డీఓ స్థానానికి ఆనంద్‌కుమార్‌ను నియమించారు. ధర్మవరం ఆర్డీఓ వెంకటశివారెడ్డిని జీఏడీలో రిపోర్టు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆ స్థానంలో విజయవాడ మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న మహేష్ అలకతూర్‌ను నియమించారు. పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖను జీఏడీలో రిపోర్టు చేయాల్సిందిగా పేర్కొన్నారు. ఇక్కడికి పీడీసీ శిక్షణ పూర్తిచేసుకున్న పరపాటి సువర్ణను నియమించారు.

బెదిరింపుల నడుమ విచారణ..!

బాధ్యులను కాపాడే పనిలో సూపరింటెండెంట్?

- తన చాంబర్‌లో సిబ్బందికి బెదిరింపులు
- అనుకూలంగా చెప్పకపోతే ఇబ్బందులు పడతారని హెచ్చరికలు
- ఏడాది క్రితం మరణాలపై సిబ్బందిని పిలవడం వెనుక ఆంతర్యమేమిటో?


మాట్లాడుతున్న విచారణాధికారి స్వప్న సింధు

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 26: స్థానిక జిల్లా ఆస్పత్రిలో ఇద్దరు గర్భస్థ శిశువుల మృతిపై విచారణ.. బెదిరింపుల నడుమ సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. శిశువుల మృతి వ్యవహారంలో చిక్కుకున్న వైద్యులను కాపాడేందుకు ఆస్పత్రి సూపరింటెండెంట్ రోహిల్ కుమార్ బెదిరింపుల పర్వానికి తెరలేపినట్లు విచారణకు హాజరైన సిబ్బంది ద్వారా తెలుస్తోంది. సూపరింటెండెంట్ చాంబర్ పక్కనే ఉన్న మీటింగ్ హాల్‌లో గైనకాలజీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ స్వప్న సింధు రెండ్రోజులుగా విచారణ చేస్తున్నారు. ఆమె రహస్యంగా విచారించి, లిఖితపూర్వకంగా ఫిర్యాదు ఇవ్వాలని చెబుతున్నారు. విచారణ ఫిర్యాదులు రాసివ్వడానికి వచ్చిన వారిని సూపరింటెండెంట్ బెదిరించి, గదిలో కూర్చోబెట్టుకుని తనకు అనుకూలంగా రాయించుకున్నట్లు ఆస్పత్రివర్గాల్లో చర్చ సాగుతోంది. ఒక ఆశావర్కర్‌ను 'విచారణలో తాను చెప్పినట్లు చెప్పకపోతే విజయవాడకు వెళ్లాల్సి ఉంటుందనీ, ఉద్యోగం పోతుంద'ని బెదిరించినట్లు సమాచారం. విషయం తెలుసుకుని చాంబర్‌లోకి వెళ్లిన మీడియా ప్రతినిధులపై సైతం సూపరింటెండెంట్ చిందులు తొక్కారు. తన చాంబర్‌లో ఫొటోలు తీయరాదంటూ హుకుం జారీచేయడం గమనార్హం. సూపరింటెండెంట్ బెదిరింపుల నేపథ్యంలో విచారణ పారదర్శకంగా సాగుతుందా అన్న అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ఆగస్టులో శిశువుల మృతిపై విచారణ చేస్తుంటే.. ఏడాది క్రితం శిశువు మృతికి సంబంధించి సిబ్బందిని పిలవడం విమర్శలకు తావిస్తోంది. విచారణను పక్కదారి పట్టించి, నీరుగార్చే ప్రయత్నం జరుగుతోందని ఆస్పత్రి వర్గాల్లో చర్చ సాగుతోంది. విచారణాధికారి మాత్రం తాను రహస్యంగా విచారణ చేసి, వాస్తవాలను ఉన్నతాధికారులకు నివేదిస్తానని పేర్కొన్నారు. ఆమె వెంట ఏఓ నాగేంద్ర ఉన్నారు.


సూపరింటెండెంట్ గదిలో తన ఫిర్యాదును చూపుతున్న ఆశావర్కర్

జెట్‌లూమ్స్‌ను మూసేయాలి

- వామపక్ష, చేనేత సంఘాల డిమాండ్
- జేఆర్ శిల్క్స్ ఫ్యాక్టరీ వద్ద ధర్నా
- నాయకుల అరెస్టు


ధర్నాలో మాట్లాడుతున్న చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవస్వామి

ధర్మవరం/బత్తలపల్లి, సెప్టెంబరు 26: చేనేత కార్మికుల పొట్ట కొడుతున్న జెట్‌లూమ్స్‌ను వెంటనే మూసేయాలని సీపీఐ, సీపీఎం, చేనేత సంఘాల నేతలు డిమాండ్ చేశారు. అక్రమాలకు పాల్పడుతున్న జేఆర్ శిల్క్స్ యజమాని జింకా రామాంజనేయులుపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు గురువారం బత్తలపల్లి సమీపంలోని వేల్పుమడుగు సమీపంలోని జేఆర్ శిల్క్స్ ఫ్యాక్టరీ వద్ద గురువారం ధర్నా చేపట్టారు. చేనేత కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షుడు మాధవస్వామి మాట్లాడుతూ.. ధర్మవరంలో లక్షలాది మంది చేనేత వృత్తిని నమ్ముకుని జీవిస్తున్నారన్నారు. అటువంటి కార్మికులకు అండగా నిలవాల్సింది పోయి వారి పొట్టకొడుతూ జేఆర్ శిల్క్స్ యాజమాన్యం.. పవర్‌లూమ్స్, జెటలూమ్స్‌ను ఏర్పాటుచేసుకుని, 5 వేల మంది చేసే పనిని పదిమందితోనే చేయిస్తోందన్నారు. తద్వారా కార్మికుల పొట్టకొడుతోందన్నారు. చేనేత రిజర్వేషన్ చట్టాన్ని తుంగలో తొక్కి, ఇష్టానుసారం ప్యూర్ టు ప్యూర్ చీరలు తయారు చేస్తున్నారని మండిపడ్డారు. ఫ్యాక్టరీని వెంటనే మూసేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ముఖ్యమంత్రికి ఫిర్యాదు చేస్తామన్నారు. అనంతరం ఫ్యాక్టరీ గేట్లను తోసుకుంటూ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులు, ఆందోళనకారుల మధ్య తోపులాట తలెత్తింది. పరిస్థితి చేయిదాటిపోతుండటంతో డీఎస్పీ శ్రీనివాసులు, సిబ్బంది.. ఆందోళనకారులను అరెస్టు చేసి, బత్తలపల్లి స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. ధర్నాలో చేనేత కార్మికసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు జగదీశ్, జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు పాల్గొన్నారు.




వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్రపై సినిమా

నిర్మాత, దర్శకుడు వెంకటసింహరాజు


దర్గాను దర్శించుకున్న చిత్ర యూనిట్

పెనుకొండ టౌన్, సెప్టెంబరు 26: శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్రపై చిత్రాన్ని తెరకెక్కించనున్నట్లు రచయిత, నిర్మాత, దర్శకుడు వెంకటసింహరాజు తెలిపారు. స్థానిక బాబయ్య దర్గాను గురువారం చిత్ర యూనిట్ దర్శించుకుని, ప్రత్యేక ప్రార్థనలు చేసింది. వెంకటసింహరాజు మాట్లాడుతూ.. వీరబ్రహ్మేంద్రస్వామి పాత్రలో హీరో సుమన్, గోవిందమ్మగా ఇంద్రజ నటిస్తున్నారన్నారు. రాయలసీమలో 75 రోజులపాటు చిత్రీకరణ ఉంటుందన్నారు. అందులో భాగంగా ఈ ప్రాంతంలో లొకేషన్ పరిశీలన నిమిత్తం వచ్చినట్లు తెలిపారు.



లేపాక్షి ఆలయం వ్యూ

అహో..!

టూరిజం హబ్‌గా జిల్లా
అన్నిప్రాంతాల్లో ప్రపంచ ప్రసిద్ధ పర్యాటక ప్రదేశాలు

నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం

శ్రీరాముడే నడయాడిన నేల లేపాక్షి..
శిల్పకళల కాణాచి..
ఆంధ్రభోజుడు విడిది చేసిన పెనుకొండ..
విజయనగర వైభవాల కొండ..
ఎకరాల్లో విస్తరించిన తిమ్మమ్మ మర్రిమాను..
ప్రపంచలోనే పెద్దదిగా రికార్డు..
లక్షలాది మందికి ఇలవేలుపు
ఖాద్రీశుడు కొలువైన కదిరి..
హెంజేరు సిద్దేశ్వరుడు..
పెనుకొండలో నిద్రిస్తున్న కుంభకర్ణుడు..
విశ్వ మానవాళికి పంచసూత్రాలు
బోధించిన పుట్టపర్తి..
విదేశీ పక్షులకు ఆతిథ్యమిచ్చే వీరాపురం..
ధర్మవరం పట్టుచీరలు..
నిమ్మలకుంట తోలుబొమ్మలు..
ఒక్కటేంటి.. అన్నీ.. అన్నీ.. ప్రపంచ ప్రసిద్ధే..
అద్భుతాలే.. పరమాద్భుతాలే..
అహో.. అనిపించే.. అపురూప ప్రదేశాలే..
మంత్రముగ్ధులను చేసే శిల్పకళాసౌరభాలే..
జిల్లా నలుమూలలా పర్యాటక క్షేత్రాలే..
ప్రపంచమే జిల్లా పర్యాటకం వైపు
తొంగిచూస్తోంది..
- పుట్టపర్తి, (ఆంధ్రజ్యోతి)



అబ్బురపరిచే శిల్పసంపద

ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎందరో దర్శించాలనుకునే ప్రదేశం లేపాక్షి. విజయనగర రాజుల కాలంలో లేపాక్షి వీరభద్రస్వామి ఆలయాన్ని నిర్మించారు. ఆలయంలో మొత్తం 878 స్తంభాలు ఉన్నాయి. 246 స్తంభాలపై ఎన్నో శిల్ప కళాకృతులు ఆకట్టుకునేలా ఉన్నాయి. లేపాక్షి ఆలయంలో అద్భుతమైన తైలవర్ణ చిత్రాలు ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తాయి. వీరభద్రస్వామి ఆలయాన్ని ఏడు ప్రాకారాలతో భారీఎత్తున నిర్మించారు. బండపై నిరంతరం నీరు ప్రవహించే సీతాదేవి పాదం, తాండమేశ్వర లింగం ప్రత్యేకాకర్షణ. వీరభద్ర స్వామి ఆలయం ఆగ్నేయ దిశలో ఉన్న ఎత్తైన శివ లింగానికి ఏడు శిరస్సుల నాగేంద్రుడు మూడుసార్లు చుట్టుకుని, కవచంగా ఉన్నట్టు దర్శనమిస్తాడు. ఆలయంలో ప్రధానంగా చెప్పుకోవాల్సింది వేలాడే స్తంభం. ఆలయాన్ని ఇటీవల జీ20 దేశాల ప్రతిని ధుల బృందం సందర్శించింది. ఆలయ నిర్మాణంపై ఆశ్చర్యం వ్యక్తం చేసింది. గతేడాది యునెస్కో తాత్కాలిక జాబితాలో లేపాక్షికి చోటు దక్కింది. లేపాక్షి ఆలయాన్ని ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ సందర్శించారు. దీంతో దేశవ్యాప్తంగా గుర్తింపు దక్కింది.

అతిపెద్ద నంది: లేపాక్షికి తూర్పు నుంచి ప్రవేశ మార్గంలోనే ఆలయానికి ఈశాన్య దిశలో లేపాక్షి-హిందూపురం ప్రధాన రహదారికి ఆనుకుని అతి పెద్ద ఏకశిలా నంది విగ్రహం కనిపిస్తుంది. దీనిని లేపాక్షి బసవయ్యా అంటారు. బసవయ్యా మెడలో పూసల హారాలు, గంటలు, రెక్కించిన చెవులు, లేవబోతూ కాలుని సరిచేసుకుంటున్న భంగిమ, మెడలో గండబేరుండ హారం, రాయలవారి రాజ ముద్రిక, కీర్తి ముఖంగా ఉన్న నంది, చూపరులను ఎంతగానో ఆకట్టుకుంటాయి. నంది దృష్టి ఆలయంలో నాగేంద్రుని చుట్టులో ఉన్న శివలింగాన్ని దర్శిస్తున్నట్లుగా అనిపిస్తుంది. కుడివైపు మెడ దగ్గర వైపు నుంచి చూస్తే ఆలయంలోని నాగేంద్రుని పడగ కనిపిస్తుంది. ఆలయంలోని శివలింగానికి, నందీశ్వరుడికి 200 మీటర్ల దూరం ఉంటుంది.



ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రం

సత్యసాయి అవతరణ, బోధనలు, ప్రేమతత్వంతో కుగ్రామంగా ఉన్న పుట్టపర్తి ప్రపంచ ఆధ్యాత్మిక కేంద్రంగా పేరొందింది. సత్యసాయి ఆధ్యాత్మిక బోధనలు ప్రపంచవ్యాప్తంగా విస్తరించాయి. సత్యసాయి బోధనల్లో ప్రేమతత్వం, సేవలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస అనే బోధనలతో కోట్లాదిమందికి సత్యసాయి గురువుగా మారారు. 150 దేశాలకు చెందిన అన్ని మతస్తులవారు.. సత్యసాయి దర్శనానికి రావడంతో పర్యాటక కేంద్రంగా కూడా ప్రత్యేక గుర్తింపు వచ్చింది. 2011లో సత్యసాయి శివైక్యం తరువాత సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. మహాసమాధి దర్శనానికి ప్రపంచ నలుమూలల నుంచి నిత్యం భక్తులు వస్తుంటారు.



శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం

అచ్యుతరాయలు నిర్మించిన ఆలయం

హరిహరరాయలు, బుక్కరాయులకు 12వ శతాబ్దంలో లక్ష్మీనరసింహ స్వామి స్వప్నంలో కనిపించి చెప్పడంతో ఖాద్రీ వృక్షం కింద ఉండే పుట్టలో ఉన్న సాలగ్రామాలను ప్రతిష్ఠించారు. అవి కాలక్రమేణా అంతరించిపోయాయి. 15వ శతాబ్దంలో విజయనగరరాజులైన అచ్యుతదేవరాయులు.. కదిరి పట్టణంలో స్వామివారి ఆదేశం మేరకు అష్టబాహువులతో హిరణ్యకశిపుని సంహరించేలా ఉండే విగ్రహాన్ని ప్రతిష్టించారు. నేటికీ పూజలందుకుంటోంది. తెలుగురాష్ట్రాల నుంచే కాక కర్ణాటక, తమిళనాడు నుంచి నిత్యం వేలాది మంది భక్తులు తరలివచ్చి, స్వామివారిని దర్శించుకుంటున్నారు. ఏటా శ్రీవారి బ్రహోత్సవాల్లో లక్షలాదిమంది పాల్గొంటారు. దేశంలోనే మూడో అతి పెద్దవైన రథం ఖాద్రీశుడిది.



ప్రపంచంలోనే పెద్దది..

ప్రపంచంలోనే అతి పెద్ద చెట్టుగా నంబులపూలకుంట మండలంలోని గూటిబైలులో ఉన్న తిమ్మమ్మ మర్రిమాను గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. 500 ఏళ్ల వయసు కలిగిన ఈచెట్టు దాదాపు 8 ఎకరాల్లో విస్తరించి ఉంది. తిమ్మమాంబ నాటిన ఈచెట్టు శాఖోప శాఖలుగా విస్తరించిందని భక్తులు చెబుతారు. చెట్టుకిందే తిమ్మమాంబ ఆలయం నిర్మించారు. ప్రతి మహాశివరాత్రికి ఇక్కడ రథోత్సవం, జాగరణ నిర్వహించడం ఆనవాయితీ. ప్రపంచఖ్యాతి పొందిన మర్రిమాను చూడడానికి నిత్యం వందలాది మంది భక్తులు వస్తుంటారు.



ప్రాచీన ఆలయం

అమరాపురం మండలం హేమావతి గ్రామంలో ఉన్న సిద్దేశ్వరస్వామి దేవాలయాన్ని క్రీస్తు శకం 8, 9 శతాబ్దాల్లో నొళంబ రాజులు నిర్మించారు. దొడ్డేశ్వర స్వామి, మల్లీశ్వరస్వామి, విరుపాక్షేశ్వర, చిత్రేశ్వర, సోమేశ్వర అను ఐదు లింగాలను ప్రతిష్ఠించారు. సిద్ధయోగి అనే మహాముని ఈ ప్రాంతంలో సంచరిస్తూ ఆలయ ప్రాంగణంలో సమాధి కావడంతో సిద్దేశ్వరస్వామిగా పిలుస్తున్నారు. శివుడు లింగరూపంలో కాకుండా మానవ రూపంలో వెలసిన క్షేత్రం దక్షిణ భారతదేశంలోనే ఇదొక్కటే. ప్రతి నిత్యం సూర్యాస్తమయ సమయంలో సూర్య కిరణాలు సిద్ధేశ్వర స్వామి నుదుటిపై పడడం విశేషం. ఏటా శివరాత్రి పర్వదినాన ఉత్సవాలు నిర్వహిస్తారు. జాతర, సిడిమాను, పూల రథం, అగ్నిగుండం, చిన్న రథోత్సవం, బ్రహ్మారథోత్సవం ఉంటాయి. స్వామి దర్శనం కోసం కర్ణాటక ప్రాంతం నుంచి కూడా వేలాది మంది భక్తులు తరలివస్తారు.



తోలుబొమ్మల పుట్టిల్లు

ధర్మవరం మండలం నిమ్మలకుంట గ్రామం తోలుబొమ్మలకు పుట్టినిల్లు. ప్రతి ఇంట్లో తోలుబొమ్మల కళాకారులున్నారు. తోలుబొమ్మల కళాకారుడు దళవాయి చలపతిరావుకు పద్మశ్రీ అవార్డు దక్కింది. దళవాయి శివమ్మ, కుళ్లాయప్పకు శిల్పగురు, పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు దక్కాయి. ఎంతోమంది ప్రముఖులు గ్రామానికి వచ్చి తోలుబొమ్మలను వీక్షిస్తుంటారు. ఈ ఊరి కళాకారులు అంతర్జాతీయ స్థాయిలో ప్రదర్శనలు, స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తుంటారు.

రాయలు ఏలిన నేల

పెనుకొండ చారిత్రాత్మక ప్రదేశం. విజయనగర సామ్రాజ్య చక్రవర్తి కృష్ణదేవరాయలు ఏలిన ప్రాంతం. ఈ ప్రాంతంలో గత వైభవానికి చిహ్నంగా అనేక కట్టడాలు, కోటగోడలు, కొండపై ఖిల్లా, లక్ష్మీనరసింహస్వామి ఆలయం, కొండకింద రాయల వేసవి విడిది గగన్మహల్, మహామంత్రి తిమ్మరుసు సమాధి, 365 దేవాలయాలు ఉన్నాయి. బాబయ్యస్వామి దర్గా, జైన దేవాలయాలు దర్శనమిస్తాయి. కొండపైకి రోడ్డు కూడా నిర్మించారు. పెనుకొండకు అంతర్జాతీయ కియ పరిశ్రమ రావడం, గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మించడంతో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోయాయి. పర్యాటకుల సంఖ్య విపరీతంగా పెరిగింది.


కొండపై పురాతన లక్ష్మీనరసింహస్వామి ఆలయం ముఖద్వారం

పట్టుచీర అంటేనే.. ధర్మవరం..

చేనేత పట్టుచీరలకు నిలయంగా ధర్మవరం ప్రసిద్ధిచెందింది. దేశంలోనే కాక పలుదేశాల్లోని మగువలు ధర్మవరం పట్టుచీరలను ఇష్టపడతారు. అత్యద్భుతమైన డిజైన్లతో చీరలను నేస్తుంటారు. ఈ చీరల కోనుగోలుకు దేశంలోని ప్రముఖులు వస్తుంటారు. చీరలపై అద్భుత డిజైన్లతో స్వామివార్ల ఫొటోలు, పీఎం, సీఎం చిత్రాలను వేస్తుండేవారు. ప్యూర్ పట్టుచీర ఒక్క ధర్మవరంలోనే దొరుకుతుందని నమ్మకం.

కేజీబీవీల్లో పోస్టుల భర్తీకి శ్రీకారం

అనంతపురం విద్య, సెప్టెంబరు 26: కేజీబీవీలో కొలువుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 5 జిల్లాలు మినహా పలు జిల్లాల్లో భారీగా పోస్టులను భర్తీ చేసేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. 2024-25 విద్యా ఏడాదికి టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను భర్తీ చేయనున్నారు. ప్రిన్సిపాల్, పీజీటీలు, సీఆర్టీలు, పీఈటీలు అకౌంటెంట్, వార్డెన్ పోస్టులను మహిళా అభ్యర్థులతో భర్తీ చేసేందుకు సిద్ధమైంది. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన పోస్టులను భర్తీ చేయనున్నారు. కొత్త జిల్లాలు యూనిట్‌గా తీసుకుని పోస్టులను భర్తీ చేయనున్నారు. అభ్యర్థులు @apkgbv.apcfss.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

భర్తీకానున్న 68 పోస్టులు

అనంతపురం జిల్లావ్యాప్తంగా కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ 68 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఇందులో టీచింగ్ పోస్టులు 57, నాన్ టీచింగ్ పోస్టులు 11 ఉన్నాయి. కాంట్రాక్టు ఉద్యోగాలు కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్స్ (సీఆర్టీ) పోస్టులు 20, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్స్ (పీజీటీ) పోస్టులు 21, అవుట్ సోర్సింగ్ పోస్టులు పార్ట్ టైం టీచర్స్ 16 పోస్టులు, వార్డెన్స్ 7 పోస్టులు, అకౌంటెంట్లు 4 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 68 పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

అక్టోబరు 10వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ

ఈనెల 26వ తేదీ నుంచి వచ్చే నెల 10వతేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. 14వ తేదీ నుంచి 16వ తేదీ మధ్య అభ్యర్థుల జనరల్ మెరిట్ లిస్టును సమగ్రశిక్ష స్టేట్ ప్రాజక్టు డైరెక్టర్ కార్యాలయ అధికారులు రూపొందించి విడుదల చేస్తారు. 17, 18 తేదీల్లో జిల్లాస్థాయి ఎంపిక కమిటీ అధికారుల ఆధ్వర్యంలో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుంది. 19వ తేదీ అభ్యర్థుల ఫైనల్ లిస్టును తయారు చేసి సర్టిఫికెట్లను పరిశీలిస్తారు. 21వ తేదీ ఫైనల్ మెరిట్ లిస్టుపై అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరిస్తారు. 22న తుది మెరిట్ లిస్టును ప్రదర్శిస్తారు. 23న ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నియామకపత్రాలు అందిస్తారు. కొత్త కొలువుకు ఎంపికైన వారు 24వ తేదీ డ్యూటీకి రిపోర్ట్ చేసుకోవాల్సి ఉంటుంది.

కమిటీచే అభ్యర్థుల ఎంపిక

జిల్లా కమిటీ అభ్యర్థులను ఎంపిక చేస్తుంది. కమిటీకి కలెక్టర్ చైర్మన్‌గా, డీఈఓ అండ్ సమగ్రశిక్ష ప్రాజక్టు ఎక్స్ అఫీషియో ప్రాజక్టు కో-ఆర్డినేటర్ మెంబర్‌గా, సమగ్రశిక్ష ప్రాజక్టు అడిషనల్ ప్రాజక్టు కోఆర్డినేటర్(ఏపీసీ) మెంబర్ కన్వీనర్‌గా, జిల్లా కేంద్రంలోని డిప్యూటీ డీఈఓ, గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(జీసీడీఓ) లేదా అసిస్టెంట్ జీసీడీఓ సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీ ద్వారా ఎంపికైన అభ్యర్థులకు పోస్టును బట్టి జీతం చెల్లిస్తారు. ప్రిన్సిపాల్ పోస్టుకు రూ. 34,139, పీజీటీలు, సీఆర్టీలు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్(పీఈటీ)లకు రూ. 26, 759, అకౌంటెంట్లు, వార్డెన్స్, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్స్‌కు రూ. 18, 500 వేతనం ఉంటుంది.

రూ.2.80 కోట్ల నిధులు ఏమైనట్లు...!

రైతుల సొమ్ముపై విచారణ చేయండి
ఏడీసీసీ బ్యాంకు మహాజన సభలో పీఐసీ, జేసీ శివ్‌నారాయణ్ శర్మ


మహాజన సభలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 26: రైతులకు అందాల్సిన వడ్డీ రూ.2.80 కోట్లు ఏమైనట్లని, వెంటనే విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఏడీసీసీ బ్యాంకు పర్సన్ ఇన్‌చార్జి, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ సహకార శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ సహకారభవన్‌లో జిల్లా సహకార కేంద్రబ్యాంకు 127వ మహాజన సభ జరిగింది. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పర్సన్ ఇన్‌చార్జిలుగా ఉన్న సహకార శాఖ అధికారులు మాట్లాడుతూ రైతులకు అందాల్సిన వడ్డీ సొమ్ము రూ.2.80కోట్లు ఏమైందని ప్రశ్నించారు. ఏడీసీసీ బ్యాంకు లోన్స్ ఇన్‌చార్జి డీజీఎం ఏటీ రాంప్రసాద్ జోక్యం చేసుకుని టెక్నికల్ సమస్యతో కంప్యూటర్‌లో అలా చూపిస్తోందని చెప్పడానికి ప్రయత్నించారు. ఈ విషయమై సహకార శాఖ అధికారులు వాదనకు దిగారు. ఈ సందర్భంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ కలుగజేసుకుని సొసైటీలకు సంబంధించి కంప్యూటరైజేషన్ అక్టోబరు 2వతేదీలోపు పూర్తి చేయాలన్నారు. గాంధీ జయంతి సందర్భంగా దేశమంతగా సొసైటీల ఆన్‌లైన్ సేవలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రారంభిస్తాయని తెలిపారు. నష్టాల్లో ఉన్న సొసైటీలను లాభాల్లోకి తీసుకురావడానికి పెట్రోలు బంకులు, ఫర్టిలైజర్ల విక్రయం, గోడౌన్‌ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల అమలులో కీలకపాత్ర పోషించాలన్నారు. రైతులకు అందాల్సిన రూ.2.80కోట్లు నిధులు ఏమయ్యాయి..? దేనికి మళ్లించారు..? తదితర విషయాలపై సమగ్రవిచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సహకార శాఖ అధికారులను ఆదేశించారు. సొసైటీలను సక్రమమార్గంలో నడిపించే రైతుల సేవలను మరింత విస్తృతం చేయాలని సూచించారు. జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) అరుణకుమారి మాట్లాడుతూ రికార్డుల్లో ఉండే లెక్కలకు, కంప్యూటరైజేషన్‌లో చేర్చిన లెక్కలకు ఉన్న వ్యత్యాసాలను సరిచేయాలన్నారు. ఉమ్మడి జిల్లాలో 52 గోడౌన్లు మంజూరు కాగా కేవలం 7 మాత్రమే తమకు అప్పగించారని, మిగిలిన 45 త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. సభలో ఏడీసీసీ బ్యాంకు సీఈఓ సురేఖ రాణి, డీఎల్‌సీఓ ప్రభాకర్‌రెడ్డి, బ్యాంకు అధికారులు, పాలకవర్గసభ్యులు తదితరులు పాల్గొన్నారు.


ప్రమాదంలో నుజ్జునుజ్జైన ఆటో

ఆటోను ఢీకొన్న జడ్పీ వైస్‌చైర్మన్ వాహనం

ముగ్గురు యువకులకు తీవ్రగాయాలు
కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డితోపాటు డ్రైవర్‌పై కేసు నమోదు

ధర్మవరంరూరల్, సెప్టెంబరు 26: మండలంలోని పోతుకుంట వద్ద జడ్పీ వైస్ చైర్మన్ కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డికి చెందిన స్కార్పియో వాహనం ఆటోను వేగంగా ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులకు తీవ్రగాయాలయ్యాయి. సుధాకర్‌రెడ్డి గురువారం తన స్వగ్రామైన కామిరెడ్డిపల్లి నుంచి వాహనంలో గురువారం ధర్మవరం వస్తున్నాడు. వాహనం పోతుకుంట వద్ద కుణుతూరుకు వెళ్తున్న ఆటోను వేగంగా ఢీకొంది. ఆటో డ్రైవర్ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, అందులో ప్రయాణిస్తున్న జనార్దన్, అఖిలానందరెడ్డిలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో వారికి ధర్మవరం ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి పంపారు. ప్రమాదంలో ఆటో నుజ్జునుజ్జైయింది. సుధాకర్‌రెడ్డి వాహనం ముందుభాగంలో దెబ్బతింది. స్కార్పియో వేగంగా రావడంతోనే ప్రమాదం జరిగిందని బాధితులు ఫిర్యాదు చేశారు. రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కామిరెడ్డిపల్లి సుధాకర్‌రెడ్డితోపాటు డ్రైవర్ శ్రీకాంత్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కాగా నాలుగురోజుల క్రితం ధర్మవరంలో సబ్‌జైలు వద్ద వైసీపీ, బీజేపీ వర్గీయుల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించి సుధాకర్‌రెడ్డిపై హత్యాయత్నం కేసు నమోదయ్యింది.


గాయపడిన జనార్దన్, అఖిలానందరెడ్డి, యశ్వంత్‌కుమార్‌రెడ్డి

టెక్స్‌టైల్స్ పార్క్ అభివృద్ధికి పెద్దపీట

బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత


గార్మెంట్స్ పరిశ్రమను సందర్శిస్తున్న మంత్రి సవిత, ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గంరూరల్, సెప్టెంబరు 26: రాష్ట్రంలో టెక్స్‌టైల్స్ పార్క్ అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ పెద్దపీట వేస్తుందని బీసీ సంక్షేమ శాఖ టెక్స్‌టైల్స్ జౌళిశాఖ మంత్రి సవిత అన్నారు. గురువారం మండలంలోని 74 ఉడేగోళం గ్రామం వద్ద ఉన్న టెక్స్‌టైల్స్ పార్క్‌ను ఆమె సందర్శించారు. అనంతరం టెక్స్‌టైల్స్ పార్కులో పారిశ్రామికవేత్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాయదుర్గం ప్రాంతంలో వేలాది మంది గార్మెంట్స్ పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. గార్మెంట్స్ పరిశ్రమ ద్వారా ఎక్కువమంది ఉపాధి పొందుతున్నారన్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం టెక్స్‌టైల్స్ పార్క్‌ను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. గార్మెంట్స్ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. వారికి రుణాలు అందిస్తామన్నారు. మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ టెక్స్‌టైల్స్ పార్క్ అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. గార్మెంట్స్ పరిశ్రమ అభివృద్ధికి అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టెక్స్‌టైల్స్ పార్క్ మేనేజర్ శివారెడ్డి, మండల కన్వీనర్లు హనుమంతు, హనుమంతరెడ్డి, రెడీమేడ్ గార్మెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు టంకశాల హనుమంతు, ఉపాధ్యక్షులు మురళి పాల్గొన్నారు.

ఎక్సైజ్ ఏఈఎస్‌ల బదిలీ

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 26: ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న పలువురు అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెంటెంట్‌లు (ఏఈఎస్) బదిలీ అయ్యారు. అనంతపురం ఐఎంఎల్ డిపో అసిస్టెంట్ మేనేజర్‌గా ఏఈఎస్ వేణుగోపాల్‌రెడ్డి నియమితులయ్యారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి శ్రీరామ్, అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆఫీస్ ఏఈఎస్‌గా రేవతి సుబ్రహ్మణ్యం, పుట్టపర్తి ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆఫీస్ ఏఈఎస్‌గా నరసింహులు నియమితులయ్యారు.

సమగ్రశిక్షలో పోస్టుల భర్తీ షురూ

అనంతపురం విద్య, సెప్టెంబరు 26: సమగ్రశిక్ష ప్రాజక్టులో ఖాళీగా ఉన్న సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు అక్టోబరు 1వ తేదీన ఇంటర్వ్యూ నిర్వహించనున్నారు. ఇటీవల ప్రాజక్టులో ఉన్న సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులు విద్యాశాఖకు రీప్యాట్రియేషన్ అయిన విషయం తెలిసిందే. దీంతో కొత్తగా పోస్టుల భర్తీకి ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. అందులో అర్హుల జాబితాల సిద్ధం చేశారు. అయితే ఎంత మందిని ఇంటర్వ్యూకు ఎంపిక చేశారన్న అంశాన్ని అటు విద్యాశాఖ, ఇటు సమగ్రశిక్ష ప్రాజక్టు అధికారులు గోప్యంగా ఉంచుతున్నారు.

రైళ్ల పాక్షిక రద్దు, దారి మళ్లింపు

గుంతకల్లు, సెప్టెంబరు 26: వర్షాల కారణంగా నైరుతి రైల్వేజోన్ పరిధిలోని హుబ్లీ వద్ద ట్రాక్ నీటమునగడంతో కొన్ని రైళ్లను దారిమళ్లించి, పాక్షికంగా రద్దు చేసినట్లు అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. హుబ్లీ-హైదరాబాద్ రైలు (నెం.17319)ను గురు, శుక్ర, శనివారాల్లో, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 17320)ను 27, 28, 29 తేదీల్లో దారి మళ్లించినట్లు తెలిపారు. ఈ రైళ్లను పేర్కొన్న తేదీల్లో వాడి-సూలేహల్లి మీదుగా కాకుండా, గదగ్, బళ్లారి, గుంతకల్లు బైపాస్, రాయచూరు, వాడి, సూలేహళ్లి స్టేషన్ల మీదుగా మళ్లించనున్నట్లు తెలియజేశారు. అలాగే మైసూరు-బాగల్‌కోట్ బసవ ఎక్స్‌ప్రెస్ (నెం. 17307) రైలును ఈ నెల 27, 28, 29 తేదీల్లో, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 17308)ను 26, 27, 28 తేదీల్లో బాగల్‌కోట్-షోలాపూర్ సెక్షన్‌లో పాక్షికంగా రద్దుపరచి, కేవలం షోలాపూర్-మైసూర్ సెక్షన్‌లో నడపనున్నట్లు వివరించారు. ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి ప్రయాణాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని తెలియజేశారు.

విద్యా వ్యతిరేక విధానాలపై పోరాటం

అనంతపురం విద్య, సెప్టెంబరు 26: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యావ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని ఏఐఎస్ఎఫ్ నాయకులు అన్నారు. 49వ రాష్ట్ర మహాసభలు విజయనగరంలో నవంబరు నెలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గురువారం ఆ సంఘం కార్యాలయంలో మహాసభల లోగోను ఆవిష్కరించారు. అనంతరం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు హనుమంతరాయుడు, ప్రధానకార్యదర్శి కుళ్లాయిస్వామి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదలకు వైద్య విద్యను దూరం చేస్తోందన్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన జీవోలు 107, 108 వెంటనే రద్దు చేయాలని కోరారు. ప్రభుత్వం వెంటనే పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలను రూ. 2500 పెంచాలని కోరారు. నవంబరు 27 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్ర మహాసభలు ఉంటాయన్నారు.

ఆపరేషన్‌కు భయపడి...


రామచంద్రారెడ్డి (ఫైల్)

సూది మందు వేస్తామంటే చిన్నారులు భయపడి పారిపోతుంటారు. కానీ ఓ పెద్దాయన గుండెకు ఆపరేషన్ చేస్తారని భయపడి అదృశ్యమయ్యారు. అనంతపురం రూరల్ మండలం కురుగుంట గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి రంగస్థల కళాకారుడు. ఆయనకు గుండె నొప్పి రావడంతో చికిత్స చేయించారు. వైద్యుల సూచన మేరకు ఈ నెల 23న ఆపరేషన్ చేయించాలని నిర్ణయించారు. ఆపరేషన్ అంటే భయపడిన ఆయన.. ఈ నెల 22న చెప్పాపెట్టకుండా ఇంటి నుంచి వెళ్లిపోయారు. కుటుంబ సభ్యులు ఆయన ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. 'పెద్దాయనా.. ఆపరేషన్ చేస్తే ఆయువు పెరుగుతుంది. ఇంటిల్లిపాదితో కలిసి నిండు నూరేళ్లు ఆనందంగా గడపవచ్చు. నొప్పి తెలియకుండా మత్తు మందు ఇస్తారు. ఎక్కడున్నా వచ్చెయ్.. మీ కోసం అయినవారు అందరూ ఎదురు చూస్తున్నారు..'
- అనంతపురం క్రైం


కొత్తచెరువులోని జిల్లా కార్యాలయాల వద్ద ఉన్న చెత్త

స్వచ్ఛతా నహీ సేవ

ప్రభుత్వ కార్యాలయాల వద్దే పేరుకుపోతున్న చెత్త

కొత్తచెరువు, సెప్టెంబరు 26 : పరిశరాలు పరిశుభ్రంగా ఉండాలనే లక్ష్యం కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. కలెక్టర్ టీఎస్ చేతన్.. సహా ఇతర జిల్లా స్థాయి అధికారులు, కూటమి నాయకులు ఈ కార్యక్రమాన్ని పలు ప్రాంతాల్లో ప్రారంభించి.. ప్రజలు స్వచ్ఛందంగా ఇందులో భాగస్వాములు కావాలని స్పీచ్‌లు ఇస్తున్నారు. అయితే ఇది కేవలం ప్రసంగాలకే పరిమితమైంది. క్షేత్రస్థాయిలో కార్యరూపం దాల్చడం లేదు. శ్రీసత్యసాయి జిల్లాలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి ఎదురుగా జిల్లా ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. ఆ కార్యాలయాల చుట్టూ చెత్తాచెదారం పేరుకుపోయింది. ఇటీవలే కలెక్టర్ ఇక్కడ స్వచ్ఛతా హి సేవ కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజల్లో దీనిపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. అయితే ఆ అధికారులే దీన్ని పాటించడం లేదు. ఆ ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ ప్లాస్టిక్ కవర్లు, పేపర్లు, అట్టలు తదితర చెత్తాచెదారం వేశారు.. వేస్తున్నారు.. జిల్లా స్థాయి కార్యాలయాల వద్ద పరిస్థితే ఇలా ఉంటే.. ఇక గ్రామాల్లో ఈ కార్యక్రమం సక్రమంగా అమలయ్యేనా.. ఇప్పటికైనా అధికారులు ఈ కార్యక్రమాన్ని చిత్తశుద్ధితో అమలు చేయాల్సి ఉంది.

జిల్లా అటవీ శాఖాధికారిగా చక్రపాణి



పుట్టపర్తిరూరల్, సెప్టెంబరు 26 : జిల్లా అటవీ శాఖాధికారిగా చక్రపాణి బుక్కపట్నం డైట్ కళాశాలలోని జిల్లా అటవీశాఖ కార్యాలయంలో గురువారం బాధ్యతలు స్వీకరించారు. రాజమహేంద్రవరం నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. కాగా, ఇక్కడి రవీంద్రనాథ్‌రెడ్డి రిలీవ్ అయ్యారు. ఆయనకు ఇంకా పోస్టింగ్ ఇవ్వలేదు. అటవీ ప్రాంతంలో ఇసుక, మట్టి, కలపను అక్రమంగా తరలిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని చక్రపాణి హెచ్చరించారు.

యథేచ్ఛగా కలప తరలింపు



గాండ్లపెంట, సెప్టెంబరు 26 : మండలం మీదుగా కదిరికి యథేచ్ఛగా కలప రవాణా చేస్తున్నారు. పల్లెల్లో పచ్చని చెట్లను నరికివేసి వాటిని ఇలా రవాణా చేస్తున్నారు. నిత్యం ఎన్పీకుంట, గాండ్లపెంట, కదిరి, రాయచోటి ప్రధాన రహదారుల్లో కలప అక్రమ రవాణా సాగుతున్నా అటవీ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో కలప అక్రమ వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయల్లా సాగుతోంది. అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో ఈ వ్యాపారులు రోజురోజుకూ కలప అక్రమ రవాణాను పెంచుతున్నారు. ఇలాగే కొన్ని నెలల కొనసాగితే.. పల్లెలు ఎడారిలా మారే ప్రమాదముందని మండల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధింత అధికారులు చెట్లను రక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


ఆర్డీఓకు విరాళాన్ని అందజేస్తున్న మానస నృత్యకళారులు

వరద బాధితులకు చేయూత

ధర్మవరం, సెప్టెంబరు 26: విజయవాడ వరద బాధితుల సహాయార్థం పట్టణంలోని మానస నృత్యకళాకారులు విరాళాన్ని సేకరించారు. పట్టణంలోని పలు ప్రధాన కూడళ్లలోని దుకాణాల వద్ద భిక్షాటన చేసి రూ.20,650 విరాళాన్ని సేకరించారు. దాన్ని ఆర్డీఓ వెంకటశివరామిరెడ్డికి గురువారం అందజేశారు.

తలపనేని రూ.2.50 లక్షల విరాళం



చెన్నేకొత్తపల్లి : విజయవాడ వరద బాధితులకు సహాయార్థం చెన్నేకొత్తపల్లి పెద్దమొగలాయపల్లికి చెందిన తెలుగు ప్రొఫెషనల్ వింగ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాండు తలపనేని రూ.2.50 లక్షలను విరాళంగా ఇచ్చారు. అందుకు సంబంధించిన చెక్‌ను గురువారం మంగళగిరిలోని టీడీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి అందజేశారు. దీంతో సీఎం ఆయన్ను అభినందించారు.

వేతనాల నుంచి..

పుట్టపర్తిరూరల్ : ఒక్కొక్క అంగన్‌వాడీ కార్యకర్త, హెల్పర్ వేతనం నుంచి రూ.100 చొప్పున వరద బాధితుల సహాయార్థం అందజేయాలని ఐసీడీఎస్ పీడీకి అంగన్‌వాడీ యూనియన్ అధ్యక్షురాలు శ్రీదేవి, కమిటీ సభ్యులు పద్మావతి వినతిపత్రాన్ని అందజేశారు. ఆ మొత్తాన్ని సీఎం రిలీఫ్ ఫండ్‌కు జమ చేయాలని కోరారు.

వృద్ధురాలి ఆత్మహత్య

కదిరి అర్బన్, సెప్టెంబరు 26 : స్థానిక రాధాక్రిష్ణ వీధికి చెందిన నూర్జహాన్ (61) పట్టణ శివారు ప్రాంతంలోని దేవరచెరువులో పడి ఆత్మహత్య చేసుకుంది. ఆమె కొంతకాలంగా కడపునొప్పితో బాధపడుతోంది. జీవితంపై విరక్తి చెందిన ఆమె ఈనెల 24న ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆమె కోసం గాలించినా ఫలితం లేకుండా పోవడంతో కుటుంబ సభ్యులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దేవరచెరువులో గురువారం ఓ మహిళ మృతదేహం తేలుతూ ఉండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆ మృతదేహాన్ని వెలికి తీసిన పోలీసులు.. మృతురాలిని నూర్జహాన్‌గా గుర్తించారు. మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు రూరల్ సీఐ మోహన్ తెలిపారు. కాగా, నూర్జహాన్‌కు నలుగురు కుమారులున్నారు.

విద్యుత్‌షాక్‌తో ఇద్దరికి తీవ్రగాయాలు

ధర్మవరం, సెప్టెంబరు 26 : పట్టణంలో గురువారం విద్యుదాఘాతంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. శారదానగర్‌కు చెందిన బేల్దారి బాబయ్య తన ఇంటి మిద్దెపైన మరో బేల్దారి భార్గవ్‌తో కలిసి పనులు చేస్తుండగా.. మెయిన్ విద్యుత్ తీగలు తగిలి బాబయ్య తీవ్రంగా గాయపడ్డాడు. అతన్ని కాపాడబోయి భార్గవ్‌కు కూడా గాయపడ్డాడు. వీరిద్దరిని కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం అనంతపురానికి తరలించారు.

ఆధ్యాత్మిక కేంద్రంలో అక్రమాలు

- భూగర్భ డ్రైనేజీలో సిబ్బంది చేతివాటం
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- చోద్యంచూస్తున్న ఉన్నతాధికారులు


పుట్టపర్తి పట్టణం

పుట్టపర్తి, సెప్టెంబరు 26 : ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తిలో భూగర్భ డ్రైనేజీ నిర్వహణలో మునిసిపల్ ఉద్యోగులు చేతివాటాన్ని ప్రదర్శిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన పుట్టపర్తికి దేశ, విదేశాల నుంచి నిత్యం భక్తులు వస్తుంటారు. వారికి ఎలాంటి ఇబ్బంది కలగరాదని సుమారు 25 ఏళ్ల క్రితమే పుట్టపర్తిలో భూగర్భ డ్రైనేజీని ఏర్పాటు చేశారు. ఎక్కడా మురుగునీరు బయట ప్రవహించకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. భక్తుల రాకపోకలతో పుట్టపర్తిలో లాడ్జీలు, అపార్టుమెంట్లు వందల సంఖ్యలో వెలిశాయి. ఐతే ఎవరికి వారే అన్నతీరుగా భూగర్భ డ్రైనేజీకి కనెక్షన్లు ఇచ్చుకొని వాడేసుకుంటున్నారు. భూగర్భ డ్రైనేజీని మొదట పుట్టపర్తి పట్టణాభివృద్ధి సంస్థ నిర్వహించేది. ఆ తర్వాత దాన్ని మునిసిపల్ పరిధిలోకి తీసుకొచ్చారు. అయినా యథేచ్ఛగా అక్రమ కనెక్షన్ ఇచ్చుకుని వాడేసుకుంటున్నారు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలిసినా.. స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

భవనాలు 10 వేలు పైనే.. కనెక్షన్లు 5,423 మాత్రమే

పట్టణంలో చిన్నచితకా గృహాలతో మొదలుకొని అపార్టుమెంట్లు, లాడ్జీలు, హోటళ్లు చేరి పదివేల పైచిలుకు ఉన్నాయి. కనెక్షన్లు మాత్రం అధికారికంగా 5,423 మాత్రమే ఉన్నట్లు లెక్కలు చూపుతున్నారు. మిగిలినవన్నీ అనధికారంగా కనెక్షన్లుగానే కొనసాగుతున్నాయి. భవనాలు, హోటళ్ల యజమానులు మొదట ఒక కనెక్షను తీసుకుని వాటికి మాత్రమే డిపాజిట్ చెల్లించి... మిగిలిన వాటికి పన్ను కాని.. డిపాజిట్ కాని చెల్లించడం లేదు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతున్నా.. ఉన్నతాధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారు.



మునిసిపల్ కార్యాలయం

డిపాజిట్లు ఇలా

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ కనెక్షన్ తీసుకోవాలంటే మొదట డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. షెడ్డు ఉన్న బాత్రూం కు రూ. 1,320, ఆర్‌సీసీ బిల్డింగ్‌లో ఒక బాత్రూంకు రూ.4,200, లాడ్జిలో ఒక బాత్రూంకు రూ. 6,200, డిపాజిట్ చెల్లించి కనెక్షన్ తీసుకోవాల్సి ఉంది. తదుపరి ఒక్కో బాత్రూంకు సంవత్సరానికి రూ. 360 పన్ను చెల్లించాలి. అయితే అపార్టుమెంట్లు, లాడ్జీల్లో బాత్రుంల సంఖ్యను తక్కువగా చూపి.. డిపాజిట్, పన్ను చెల్లించడం లేదు.

నిర్వహణ అస్తవ్యస్తం..

పట్టణం నుంచి మురుగునీరును బయటకు పంపు చేయడానికి మూడు ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ఇందులో సాయినగర్, గోకులం, ప్రశాంతిగ్రాంలో ఏర్పాటు చేసిన ప్లాంట్ల ద్వారా మురుగునీటి ట్రీట్ చేసి బయటకు పంపాల్సి ఉంది. అయితే వీటి నిర్వహణ సరిగా లేకపోవడంతో తరుచు మోటార్లు కాలిపోతున్నాయి. దీంతో మురుగునీటిని నేరుగా చిత్రావతి నది, చెరువలోకి వదిలేస్తున్నారు. ఈ కారణంగా చిత్రావతి, చెరువునీరు కలుషితం అవుతోందని.. తాము అనేక రోగాల బారిన పడుతున్నామని ప్రజలు వాపోతున్నారు. కర్ణాటకనాగేపల్లి వద్ద మురుగునీటిని శుద్ధిచేయడానికి ప్లాంటుని ఏర్పాటు చేశారు. అయితే పంపుహౌస్‌ల నుంచి మురుగునీటిని తీసుకెళ్లే పైపులైన్ చిత్రావతి నది వద్ద తెగిపోయి సంవత్సరాలు గడుస్తున్నా మరమ్మతులకు నోచుకోలేదు.

> **అక్రమ కనెక్షన్లు తొలగిస్తున్నాం**
>
> పట్టణంలో మా దృష్టికి వచ్చిన అక్రమ డ్రైనేజి కనెక్షన్లను తొలగిస్తున్నాం. పట్టణంలో కొత్తగా భవనాలు నిర్మించేవారికి డిపాజిట్ చెల్లించిన తర్వాతనే నిర్మాణానికి అనుమతి ఇస్తున్నాము.
>
> - స్వాతి, ఏఈ

నీటి ఎద్దడిని శాశ్వతంగా పరిష్కరిస్తాం

పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

పుట్టపర్తి, సెప్టెంబరు 26: పుట్టపర్తి మున్సిపాలిటీలో నీటి ఎద్దడిని శాశ్వతంగా పరిష్కరించడానికి చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి స్పష్టం చేశారు. స్థానిక హనుమాన్ సర్కిల్‌లో గురువారం నిర్వహించిన ఇది మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గతంలో టీడీపీ హయంలో మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి రూ.100 కోట్లతో వాటర్ ప్రాజెక్టుకు చర్యలు ప్రారంభించారన్నారు. అయితే అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ పాలకులు ఈ ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యం చేశారన్నారు. ప్రస్తుతం మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆ వాటర్ ప్రాజెక్టును పూర్తి చేసి... మున్సిపాలిటీలో శాశ్వత ప్రాతిపదికన తాగునీటిని సరఫరా చేసేలా చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. అధికారులు సమన్వయంతో ఆ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాజం నుంచి గ్యాంబ్లింగ్, గంజాయిని తరిమేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

ఎక్స్‌అఫీషియో సభ్యురాలిగా...

పుట్టపర్తి మునిసిపాలిటి ఎక్స్ అఫిషియో సభ్యురాలిగా ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. గురువారం మునిసిపల్ కార్యాలయంలో ఛైర్మన్ తుంగా ఓబుళపతి ఆధ్యక్షతన కౌన్సిల్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అందులో పాల్గొన్న ఎమ్మెల్యేతో కమిషనర్ ప్రహల్లాద ఎక్స్ అఫిషియో సభ్యురాలుగా ప్రమాణం చేయించారు. అనంతరం కౌన్సిల్ సాధారణ సమావేశాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి

టీడీపీ నాయకుడి మృతి

బత్తలపలి, సెప్టెంబరు 26: మండలంలోని మాల్యవంతం గ్రామానికి చెందిన టీడీపీ మండల కన్వీనర్ నారాయణరెడ్డి తమ్ముడు, టీడీపీ నాయకుడు గోనుగుంట్ల రాజు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మరణించాడు. మృతదేహాన్ని మాల్యవంతం గ్రామానికి తరలించారు. మంత్రి సత్యకుమార్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, టీడీపీ రాష్ట్రకార్యదర్శి విజయ్‌కుమార్, జనసేన ప్రధాన కార్యదర్శి చిలకం మదుసూధనరెడ్డి, నియోజకవర్గంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు మాల్యవంతం గ్రామానికి వెళ్లి.. రాజు మృత దేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఇందులో చల్లా శ్రీనివాసులు, బాజ్జి, కేశవ, విశ్వనాథ్, ఉమపతి నాయుడు, సంగాల సూరి, కిష్టయ్య, రవి, సురేంద్ర, రమణ, బీజేపీ నాయకులు కోటిసూర్య ప్రకాష్ బాబు, వీర నారప్ప పాల్గొన్నారు.


రాజు మృతదేహానికి నివాళులర్పిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే

నిరుపయోగంగా బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్లు

- ఆరు నెలల క్రితం మూడు టవర్ల ఏర్పాటు
- నేటికీ ప్రారంభించని అధికారులు
- సిగ్నల్స్ అందక పలు గ్రామీణుల ఇక్కట్లు

గాండ్లపెంట, సెప్టెంబరు 26: గాండ్లపెంట, తలుపుల మండలాల్లోని సుమారు 25 గ్రామాలకు సెల్‌ఫోన్ సిగ్నల్స్ అందడం లేదు. గాండ్లపెంట మండలంలోని గరుగుతండా, పి. పెద్దతండా, తలుపుల మండలంలోని తురకవాండ్లపల్లి వద్ద ఆరు నెలల క్రితం బీఎస్ఎన్ఎల్ సంస్థ వారు సెల్ టవర్లను ఏర్పాటు చేశారు. అయితే వాటిని ఇంతవరకూ వినియోగంలోకి తేకపోవడంతో ఆ గ్రామస్థులకు నేటికీ ఇక్కట్లు తప్పడం లేదు. ఇప్పటికైనా బీఎస్ఎన్ఎల్ అధికారులు స్పం దించి ఆ టవర్లను ప్రారంభించి.. తమకు సిగ్నల్స్ అందేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.


గరుగుతండాలో ఉన్న టవర్

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక

కదిరి అర్బన్, సెప్టెంబరు 26 : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన క్రీడా పోటీల్లో బ్లూమూన్ విద్యార్థులు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్ 14లో బాలికల విభాగం కోకోలో హర్షిత, నవ్యత, బాలుర విభాగంలో రోహిత్, అండర్ 17 కోకో బాలికల విభాగంలో దీక్షితరెడ్డి, శ్రీజారెడ్డి, బాలుర విభాగంలో భాను, రేవత్, కబడ్డీ బాలికలు సేమీరారెడ్డి ఎంపికయ్యారు.


జిల్లాస్థాయికి ఎంపికైన బ్లూమూన్ విద్యార్థులు

కొత్తచెరువు : స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పాఠశాల క్రీడలను గురువారం ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి మొరాజీ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యాశాఖ అధికారి మీనాక్షి మాట్లాడుతూ.. విద్యార్థులలోని క్రీడాప్రతిభను వెలికితీయడానికి స్కూల్ గేమ్స్‌ను ప్రభుత్వం నిర్వహిస్తోందని, ఇవి విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయడానికి దోహదపడతాయని అన్నారు. ఇందులో విజేతలు జిల్లా స్థాయిలో జరిగే క్రీడలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటేశ్, రామకృష్ణ, ప్రభాకర్, రమేశ్, ఓబులేసు పాల్గొన్నారు.


జిల్లా స్థాయి క్రీడాపోటీలకు ఎంపికైన కొత్తచెరువు విద్యార్థినులు

అర్ధరాత్రి పూజలు

- జంతుబలిపై కేసు నమోదు

హిందూపురం, సెప్టెంబరు 26: కంప్యూటర్ యుగంలోనూ మూఢనమ్మకాలు వీడట్లేదు. హిందూపురం మండలం జీవ్‌మాకులపల్లికి చెందిన హనుమంతప్ప, అతడి కుమారుడు గిరీష్ ద్విచక్రవాహనంలో ఈనెల 2న ఉదయం పొలం వద్దకు వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి ఇంటికెళ్తుండగా లేపాక్షి మండలం పులమతి రోడ్డులో వెనుకవైపు నుంచి బుల్లెట్ వాహనం ఢీకొంది. దీంతో హనుమంతప్ప తలకు బలమైన గాయమై, కోమాలోకి వెళ్లాడు. అతడి కుమారుడు గిరీష్.. ఓ పూజారిని సంప్రదించగా.. ప్రమాదస్థలంలో పూజలు చేయిస్తే నయం అవుతుందని చెప్పాడు. ఆ మేరకు కర్ణాటక రాష్ట్రం చింతామణికి చెందిన మునియప్ప అనే మాంత్రికుడి ద్వారా ఈనెల 24న అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో రోడ్డు ప్రమాద ప్రాంతంలో పూజలు చేశారు. భయానక బొమ్మను తయారుచేసి, జంతుబలి ఇచ్చాడు. మరుసటిరోజు అటుగా వెళ్లేవారు నడిరోడ్డుపై పూజలు చేయడం, అక్కడున్న భయానక బొమ్మ, రక్తం పడి ఉండడాన్ని చూసి భయభ్రాంతులకు లోనయ్యారు. దీనిపై డీఎస్పీ మహేష్‌ను అడగ్గా.. దేవుని పేరు చెప్పి ఇలాంటి వాటికి పాల్పడితే మాంత్రికులైనా, తాంత్రికులైనా చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. జంతుబలి ఇవ్వడంతో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు.

క్లుప్తంగా ..

నేడు, రేపు ప్రజాభిప్రాయ సేకరణ

కదిరి, (అమడగూరు), సెప్టెంబరు 26 : రాష్ట్రంలో చేపట్టాల్సిన అభివృద్ధి, సలహాలను కనీసం 10 వేల మంది నుంచి ప్రతి మండల, మున్సిపాలిటీల నుంచి గురు, శుక్రవారాల్లో సేకరిస్తున్నట్లు ఎంపీడీఓ మునియప్ప గురువారం తెలిపారు. అందులో భాగంగా ప్రతి ప్రభుత్వ కార్యాలయం, బస్టాండ్, ఆసుపత్రుల వద్ద క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేస్తున్నామని, దాన్ని స్కాన్ చేసి.. ప్రతి ఒక్కరు తమ అభిప్రాయాన్ని తెలపాలని కోరారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాన్ని చేరే విధంగా సలహాలు ఇవ్వాలన్నారు.

చాకలి ఐలమ్మకు ఘన నివాళి

కొత్తచెరువు సెప్టెంబరు 26 : స్వాతంత్రం పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ 128వ జయంతి సందర్భంగా స్థానిక రజక కాలనీలో ఆమె చిత్రపటానికి గురువారం పలువురు నివాళులర్పించారు. ఇందులో రజక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాపణపల్లి శివప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు తలుపుల నారాయణ, ఆర్డీసీ నారాయణ, నియోజకవర్గ అధ్యక్షుడు గూడూరు గంగాధర్, ఉపాధ్యక్షుడు ఓబుళేశు, మహిళా జిల్లా కన్వీనర్ రాధమ్మ, నాయకులు భారతి, సాయిలీల, మౌనిక, జ్యోతి, లక్ష్మీ, తులసమ్మ పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలపై అవగాహన

నల్లచెరువు, సెప్టెంబరు 26: బాల్య వివాహాలతో జరిగే అనర్థాలపై మండలంలోని దేవిరెట్టిపల్లిలో ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు గురువారం అవగాహన కల్పించారు. సమత ఎన్జీవో కైలా, సత్యార్థ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ మోబలైజర్ మౌనిక అవగాహన కల్పించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాణాప్రతాప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు ....

తనకల్లు : మండలంలోని బొంతపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్ఐ గోపి విద్యార్థులకు చట్టాలపై గురువారం అవగాహన కల్పించారు. పోక్సో చట్టం గురించి వివరించారు. వాట్సాప్, ఫేస్‌బుక్కుల్లో నూతన పరిచయాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌టీఏ కార్యవర్గం ఏర్పాటు

తనకల్లు, సెప్టెంబరు 26: స్థానిక ఎమ్మార్సీ భవనంలో నోబుల్ టీచర్స్ అసోషియేషన్ (ఎన్‌టిఏ) కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షుడిగా మురళీస్వామి, అధ్యక్షుడిగా ఈ. శివశంకర్, ప్రచార కార్యదర్శిగా రామచంద్ర, మహిళ కార్యదర్శి అరుణమ్మ, సహాయ కార్యదర్శి రోజాశ్రీ, సభ్యులు ప్రకాష్, రమేష్, మరో పది మందిని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్ఐగా మున్వర్‌బాషా



ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 26: ఓడీసీ మండల ఆర్ఐగా మున్వర్‌బాషా గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇతను గాండ్లపెంట ఆర్ఐగా పనిచేస్తు, బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడి ఆర్ఐ నాగేంద్ర బదిలీపై కదిరికి వెళ్లారు.

ఓడీసీ ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక

ఓబుళదేవరచెరువు, సెప్టెంబరు 26 : ఓడీసీ ప్రెస్‌క్లబ్ కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బి. గోపీనాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కుచ్చెపు శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడిగా మోమీన్ ఫయాజ్, కార్యవర్గ సభ్యులుగా టిన్ను మల్లికార్జున రెడ్డి, కత్తి ఆనంద్, అయ్యప్ప, కంచి రమణ, జి. బాబాను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా కార్యవర్గ సభ్యులు సాదిక్, భుజంగరావు, విలేకరులు పాల్గొన్నారు.

ఆలయ భద్రత పరిశీలన

తనకల్లు, సెప్టెంబరు 26 : మండల పరిధిలోని పాపాగ్ని నది పరివాహక ప్రాంతంలో తవళం గ్రామం సమీపంలోని తవళం ఆంజనేయస్వామి ఆలయ భద్రతను ఎస్ఐ గోపీ గురువారం పరిశీలించారు. రథం భద్రతపై ఆరాతీశారు. ఆలయంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, రథానికి తగిన భద్రత కల్పించాలని ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు.

ఎన్టీఆర్ అభిమానుల సంఘం ఏర్పాటు

కొత్తచెరువు, సెప్టెంబరు 26 : ఎన్టీఆర్ అభిమానుల మండల సంఘాన్ని గురువారం స్థానిక సందీప్ థియేటర్ సమీపంలో గురువారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మండల అధ్యక్షుడిగా ఉపేంద్ర చౌదరి, పట్టణ అధ్యక్షుడిగా పోలినేని మౌర్యని ఎంపిక చేసినట్టు తెలుగు యువత నాయకుడు చికెన్ సెంటర్ వెంకటేశ్ తెలిపారు.

టీడీపీ కార్యకర్త మృతి

నల్లమాడ, సెప్టెంబరు 26 : మండలంలోని మసకవంకపల్లిలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు యల్లప్ప అనారోగ్యంతో గురువారం మరణించాడు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి ఆ గ్రామానికి వెళ్లి.. యల్లప్ప మృతదేహానికి నివాళ్లు అర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ. ఐదు వేల ఆర్థిక సాయం అందజేశారు.

గ్రోమోర్ సెంటర్ ప్రారంభం

నల్లమాడ, సెప్టెంబరు 26: స్థానిక వైఎస్ఆర్ సర్కిల్‌లో గ్రోమోర్ సెంటర్‌ను కోరమాండల్ మన గ్రోమోర్ శాస్త్రవేత్త డాక్టర్ చక్రధర్ గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయలో నూతన సాంకేతికత, సేంద్రీయ ఎరువుల ప్రాముఖ్యతను వివరించారు. పంటలకు సూచనలు, సలహాలు గ్రోమోర్ సిబ్బంది ద్వారా పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా మేనేజర్ కలందర్, భాసుప్రకాష్, ఏఓ సుమతి పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ నిర్వహణకు సన్నాహాలు



ఎస్ఐకి వినతిపత్రం అందిస్తున్న నిర్వాహకులు

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 26: మండల కేంద్రంలో నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నీ నిర్వహణకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. గాంధీ జయంతి సందర్భంగా ఈ మెగా టోర్నీని ప్రారంభించనున్నట్లు ఎస్సీపీ మెంబర్ జబీవుల్లా తెలిపారు. గురువారం ఎస్ఐ రమేష్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఆయన మాట్లాడుతూ యువత ప్రతిభ ఉన్నా క్రీడల్లో రాణించలేకపోతున్నారన్నారు. అలాంటివారి ప్రతిభా పాటవాలను వెలికితీసి మంచి క్రీడాకారులుగా మలిచేందుకు టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టోర్నీ విజేతలకు రూ.30వేలు, రన్నర్‌కు రూ.20వేలు పారితోషికాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. ఇందులో పాల్గొనే క్రికెట్ టీమ్‌ల క్యాప్టన్లు తమటీమ్ పేరును నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. వివరాలకు 8790054786, 9398015391 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రన్నరప్‌గా జిల్లా ఫుట్‌బాల్ జట్టు



రన్నరప్ ట్రోఫీతో శ్రీసత్యసాయి జిల్లా జట్టు

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 26: ఆంధ్రప్రదేశ్ ఫుట్‌బాల్ సంఘం ఆధ్వర్యంలో రెండురోజులుగా విజయవాడలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు రన్నరప్‌గా నిలిచినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జె.వి. అనిల్‌కుమార్ తెలిపాడు. సెమీఫైనల్‌లో కర్నూలు జట్టు మీద పెనాల్టీ షూటౌట్‌లో 5-4 గోల్స్‌తో జిల్లా జట్టు విజయం సాధించి, ఫైనల్‌కు చేరింది. టైటిల్ పోరులో అనంతపురం జట్టు చేతిలో 0-5 తేడాతో జిల్లా జట్టు ఓడిపోయింది. జట్టుకు కోచ్‌గా మహ్మద్‌సలీం, దుర్గాప్రసాద్ వ్యవహరించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



పూజిత

లేపాక్షి, సెప్టెంబరు 26: స్థానిక ప్రభుత్వ ఓరియంటల్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న పూజిత అనే విద్యార్థిని రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గిరి తెలిపారు. పూజిత చదువుతోపాటు ఆటల్లో రాణిస్తోందన్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో జరిగే రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి అనంతపురం జిల్లా తరపున పాల్గొంటుందన్నారు. పూజితను ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు అభినందించారు.

జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు..



ఎంపికైన విద్యార్థులతో టీచర్లు

గుడిబండ, సెప్టెంబరు 26: మండలంలోని రాళ్లపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు జిల్లాస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం భారతి తెలిపారు. ఇటీవల నియోజకవర్గ స్థాయిలో జరిగిన స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో సత్తాచాటి జిల్లాస్థాయి పోటీలకు సీనియర్స్ విభాగంలో భార్గవి, వర్షిత, షాకీర్, రాకేష్‌లు, జూనియర్స్ విభాగంలో అరుణ్, హర్షవర్దన్, లక్ష్మీకాంత్, అజయ్ ఎంపికైనట్లు ఆమె తెలిపారు.

రొళ్ల: నియోజకవర్గం స్థాయిలో నిర్వహించిన స్కూల్‌గేమ్స్ పోటీలలో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి పోటీలకు ఎం.రాయాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. అండర్-17 బాలికల విభాగంలో ఎం. యమున, ఆర్.నివేదిత, వాత్సల్య, సబిత, వరలక్ష్మి, అమూల్య ఎంపికయ్యారు.

మారని ఆర్పీల తలరాత..



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్

పెనుకొండ, సెప్టెంబరు 26: ఎన్ని ప్రభుత్వాలు మారినా మెప్మా ఆర్పీల తలరాతలు మారడంలేదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రమేష్ అన్నారు. గురువారం స్థానిక షిర్డీసాయి భజన మందిరంలో నగర పంచాయతీలో మెప్మా సమైఖ్యలో పనిచేస్తున్న ఆర్పీల సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలకపాత్ర పోషిస్తున్న వీరికి వేతనాలు, ఉద్యోగ భద్రత లేకుండా పనిచేస్తున్నారన్నారు. అనంతరం ఆర్పీల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా నారాయణ, అధ్యక్షురాలిగా లక్ష్మీదేవి, కార్యదర్శి సునీతలను ఎంపిక చేశారు.

గుండె వైద్యశిబిరానికి స్పందన

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 26: ఉచిత గుండె వైద్యశిబిరానికి మంచి స్పందన లభించింది. మండల కేంద్రంలోని శ్రీసాయి ఆసుపత్రి ఆధ్వర్యంలో గురువారం శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కిమ్స్‌సవేరాకు చెందిన వైద్య నిపుణులు, సిబ్బంది రోగులను పరీక్షించారు. సోమందేపల్లి పట్టణంతోపాటు చుట్టుపక్కల గ్రామాల్లోని రోగులు తరలివచ్చారు. వైద్య శిబిరాన్ని మూడు నెలలకోసారి నిర్వహిస్తామని నిర్వాహకులు రాఘవేంద్రకుమార్, మహేశ్వరి తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 26: సేవామందిరం సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం హిందూపురం పట్టణం, మణేసముద్రం, కొట్నూరు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ భూపతి ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు విద్యుత్ ఉండదని, ఇందుకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పనిభారం తగ్గించాలి

పావగడ, సెప్టెంబరు 26: పని భారం తగ్గించాలని గ్రామ కార్యదర్శులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం గ్రామ కార్యదర్శులు దీక్ష చేపట్టారు. వారు మాట్లాడుతూ 54 మంది గ్రామ కార్యదర్శులు పనిచేయాల్సిన చోట 27 మంది రెండు సర్కార్లకు ఒక్కరే బాధ్యత నిర్వహిస్తూ పనిచేయడం తీవ్ర ఒత్తిడికి గురిచేస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి పల్లెలోనూ జీపీఎస్ పంట పొలాల్లో బీమా ఆర్డర్ లింక్ తదితర అంశాలపై పనిచేయడానికి తమ మొబైల్ యాప్ ద్వారా పనిచేస్తూ తీవ్ర ఒత్తిడికి ఉరవుతున్నామన్నారు. ప్రభుత్వం నుంచి రూ.500నుంచి రూ.3వేలు దాకా ఖర్చులు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు రంజిత్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామ కార్యదర్శులు తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.



సమస్యల పరిష్కారం కోరుతూ గ్రామ కార్యదర్శుల దీక్ష

మడకశిరను అన్నివిధాలా అభివృద్ధి చేస్తా

● ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర(అమరాపురం), సెప్టెంబరు 26: నియోజకవర్గాన్ని అన్నవిధాలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. అమరాపురం మండలంలోని తమ్మడేపల్లి పంచాయతీ నాగోనపల్లి గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామితో పాటు ఎమ్మెల్యే కార్యక్రమంలో పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు గడిచిన సందర్భంగా మా మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని నాగోనపల్లి గ్రామంలో మండల కన్వీనర్ గణేష్ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి శూన్యం అన్నారు. వక్కమార్కెట్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. తమ్మడేపల్లి పంచాయతీకి రూ.50లక్షలతో సీసీ రోడ్డు మంజూరు, ఓఆర్ఎస్ ట్యాంకు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఏసీ నాగరాజు, ఏపీఎం తిప్పన్న సమక్షంలో మహిళలకు చెక్కులను అందజేశారు. విద్యాభివృద్ధి నిధులను అర్థంతరంగా ఆగిన భవనాలకు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. అనంతరం ఇళ్ల వద్దకు వెళ్లి స్టిక్కర్లను అతికించారు. ఎంపీడీఓ భాస్కర్, మండల కన్వీనర్ గణేష్, జయకుమార్, మాజీ జడ్పీటీసీ నరసింహమూర్తి, మంజునాథ్, వి.ఎం. పాండురంగప్ప, శివరుద్రప్ప, మాజీ ఎంపీపీ కృష్ణమూర్తి, జయరామప్ప, మారుతీప్రసాద్, రామచంద్రప్ప, నవీన్‌కుమార్, రఘు, లింగరాజు, చెన్నప్ప, గౌడరంగప్ప, గురుసిద్దప్ప, హనుమంతు, ఎంపీటీసీ ఓంకార్ స్వామి, శ్రీరామ్, కృష్ణమూర్తి, తిప్పేస్వామి పాల్గొన్నారు.

మొక్కల పెంపకం ప్రారంభం: మండలంలోని మద్దనకుంట గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పథకం అవెన్యూ ప్లాంటేషన్ కింద మొక్కలు పెంచే కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని పిలుపునిచ్చారు.

కూటమి పాలన భేష్



మావటూరులో ప్రజలకు కరపత్రాలు అందిస్తున్న టీడీపీ నాయకులు

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 26: వంద రోజుల్లో కూటమి ప్రభుత్వ పాలన అద్భుతంగా ఉందని టీడీపీ నాయకులు అన్నారు. మండలంలోని మావటూరు, అడదాకులపల్లి గ్రామాల్లో టీడీపీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. మాజీ సర్పంచ్ ఈశ్వర్ ప్రసాద్, ఉపేంద్ర నాయక్, మావటూరు గోపాల్, బోయనాగరాజు, సచివాలయ ఉద్యోగులు ప్రతి ఇంటికి తిరిగి స్టిక్కర్లు పంపిణీ చేశారు.

పెనుకొండ టౌన్: కూటమి ప్రభుత్వం వంద రోజులు పూర్తిచేసుకుని మంచి ప్రభుత్వంగా పేరు తెచ్చుకుందని మైనార్టీ నాయకుడు దాదు అన్నారు. గురువారం పట్టణంలోని దర్గా ప్రాంతంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. త్రివేంద్ర, కృష్ణమూర్తి, కురుబ శ్రీనివాసులు, అశ్వత్థప్ప పాల్గొన్నారు.

మడకశిర టౌన్: పేదలకు సంక్షేమ ఫలాలు అందాలంటే ఒక్క సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని టీడీపీ మైనారిటీ సెల్ అధ్యక్షుడు భక్షర్ అన్నారు. గురువారం పట్టణంలోని 4, 16 వార్డులు, సి.సి.బండ, నాగన్నకుంట తదితర ప్రాంతాల్లో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. యువత పట్టణ అధ్యక్షుడు తిమ్మరాజు, నాయకులు కృష్ణనాయక్, అక్కంపల్లి బాబు, అంజమ్మ పాల్గొన్నారు.

ఉలవల పంపిణీ



రైతులకు ఉలవలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 26: మండల కేంద్రంలోని రైతుభరోసా కేంద్రంలో ఉలవల పంపిణీని గురువారం టీడీపీ నాయకులు ప్రారంభించారు. వ్యవసాయశాఖ అధికారి కవితరాణి ఆధ్వర్యంలో చేపట్టారు. సబ్సిడీతో అందిస్తున్న ఉలవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. బోయచంద్ర, సూరీ, కిష్టప్ప, రామాంజి, ప్రియాంక, సబిహా, బాబ్జాన్ పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.లక్ష విరాళం



దాతకు రసీదు అందచేస్తున్న ఆలయ కమిటీసభ్యులు

గోరంట్ల, సెప్టెంబరు 26: మండలంలోని వానవోలు రంగనాథ స్వామి ఆలయ నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన కరణం రాజేంద్రప్రసాద్ రూ.1,11,116 విరాళం గురువారం కమిటీ సభ్యులకు అందించారు. పురాతన ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో ఆస్థానంలో నూతన ఆలయ నిర్మాణం చేపట్టారు. ఆలయ నిర్వాహకుల అభ్యర్థనమేరకు కరణం రాజేంద్రప్రసాద్, సోదరుడు లక్ష్మీనారాయణరావు కుటుంబ సభ్యులు ఆలయ బ్యాంక్‌ఖాతాకు జమ చేశారు.

పొంచి ఉన్న ప్రమాదం

● పాఠశాల ఆవరణలోనే ట్రాన్స్‌ఫార్మర్



పాఠశాల ఆవరణలో రక్షణలేని ట్రాన్స్‌ఫార్మర్

హిందూపురం(సోమందేపల్లి), సెప్టెంబరు 26: మండల కేంద్రంలోని ఎంపీయూపీ ఉర్దూ పాఠశాల విద్యార్థులకు ప్రమాదం పొంచి ఉంది. పాఠశాల ఆవరణలో ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో ఎప్పుడేం జరుగుతుందోనని ఉపాధ్యాయులు భయపడుతున్నారు. కొన్నేళ్ల క్రితం విద్యుత్‌శాఖాధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతోపాటు హైటెన్షన్ విద్యుత్‌లైన్‌ను అక్కడి నుంచి లాగారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు కంచె ఏర్పాటు చేయడం మరిచారు. పాఠశాలలో 30మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఆవరణలో ప్రహరీకి ఆనుకుని మరుగుదొడ్లున్నాయి. దాని వెనుకే ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో చిన్నారులు పొరపాటున అక్కడికి వెళ్తే ఏ ప్రమాదం సంభవిస్తుందోనని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సమస్యను విద్యుత్‌శాఖాధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని వాపోతున్నారు. తక్షణం ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి తొలగించాలని, లేనిపక్షంలో కంచెను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



పిచ్చి మొక్కలు తొలగిస్తున్న బాలయేసు విద్యార్థులు

హిందూపురం అర్బన్, సెప్టెంబరు 26: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటేనే ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అశ్వత్థనారాయణ అన్నారు. గురువారం స్వచ్ఛతాహీసేవ కార్యక్రమంలో భాగంగా బాలయేసు కళాశాల విద్యార్థులు హిందూపురంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. ప్లాస్టిక్ కవర్లు, బాటిల్‌లు తొలగించారు. అనంతరం బస్టాండ్ గ్యాలరీలో మొక్కలు నాటారు. ఆర్టీసీ ఏడీసీ ఓంకార్‌మూర్తి, నాయక్, చెన్నారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ జియావుల్లా, పర్యావరణ ప్రేమికుడు భాస్కర్‌రెడ్డి, హరీష్, అధ్యాపకుడు శివరామిరెడ్డి విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శ్రమదానం

గోరంట్ల: పట్టణంలోని ఎస్కేడీఆర్ జూనియర్, ఎస్‌పీవీఎం డిగ్రీ కళాశాలలో స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గురువారం చేపట్టారు. కళాశాల ఆవరణలోని పిచ్చిమొక్కలను వలంటీర్లు తొలగించి శుభ్రం చేశారు. పరిసరాల పరిశుభ్రతలో దోమల నివారణతోపాటు ప్రజలు రోగాలబారిన పడకుండా కాపాడవచ్చన్నారు. ప్రిన్సిపాళ్లు విజయలక్ష్మి, భక్తవత్సలం, ఎన్ఎస్ఎస్ పీఓలు ఆజాద్, రఘునాథరెడ్డి, బాలమోహన్, అధ్యాపకులు శ్వేత, లక్ష్మీ, రిజ్వానా, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

అవెన్యూ ప్లాంటేషన్‌కు రక్షణ కరువు

● ఎండిపోతున్న మొక్కలు

● చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



544-ఈ జాతీయ రహదారి పక్కన నాటిన చెట్లు కిందకు పడిపోయిన దృశ్యం

చిలమత్తూరు, సెప్టెంబరు 26: ఉపాధి హామీ పథకంలో భాగంగా రోడ్లకు ఇరువైపులా నాటిన అవెన్యూ ప్లాంటేషన్‌కు రక్షణ కరువైంది. నాటిన ప్రతి మొక్కను రక్షించుకోవాలన్న ఉద్దేశ్యంతో పెద్ద ఎత్తున వ్యయం చేసినా అధికారుల నిర్లక్ష్యంతో నీరుగారిపోతోంది. మండలంలో పచ్చదనాన్ని పెంపొందించే ప్రయత్నంలో భాగంగా ప్రతిష్ఠాత్మకంగా కొడికొండ చెక్‌పోస్టు-హిందూపురం వెళ్లే 544-ఈ జాతీయ రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు. వీటికి రూ.8,20,602 వ్యయం చేశారు. నాటిన మొక్కలను పశువుల నుంచి కాపాడటం కోసం రక్షణ ఏర్పాటుచేశారు. మొక్కలకు నీటి సరఫరా చేయడానికి ట్యాంకర్లు, వాటిని నిత్యం సంరక్షించడానికి ఒక వాచర్‌ను ఏర్పాటుచేశారు. నాటినప్పటి నుంచి వర్షాలు బాగా కురువడంతో నీటి సమస్య తప్పినట్లైంది. కానీ ఎదుగుతున్న మొక్కలను రక్షించుకునేవారు లేకుండా పోయారు. ఇటీవల అధిక వర్షాలకు, గాలివానకు రోడ్డుకి ఇరువైపులా ఎదుగుతున్న మొక్కలు పెద్ద సంఖ్యలో నేలపై వాలిపోయాయి. కొన్ని విరిగిపోయి ఎండిపోయాయి. మరికొన్ని పశువుల పాలయ్యాయి. దీంతో లక్షల వ్యయం చేస్తూ నిర్వహిస్తున్న మొక్కల పెంపకం నీరుగారిపోతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మొక్కలను సంరక్షిస్తే జాతీయ రహదారి పచ్చదనాన్ని సంతరించుకోవడంతో పాటు పర్యావరణానికి కొంత వరకు మేలుచేసిన వారవుతారని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

కల్వర్టు నిర్మాణానికి మోక్షమెప్పుడో..?

● ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

● పట్టించుకోని అధికారులు



ఇరిగేపల్లి వద్ద తెగిపోయిన కల్వర్టు

అగళి, సెప్టెంబరు 26: మండలంలోని ఇరిగేపల్లి గ్రామం వద్ద కల్వర్టు తెగిపోయి సంవత్సరాలు గడిచినా నేటికీ మరమ్మతులు చేపట్టలేదని టీడీపీ స్థానిక సర్పంచ్ లక్ష్మమ్మ లింగరాజు, గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు సంవత్సరాల క్రితం భారీ వర్షాలకు తెగిపోయిన కల్వర్టుకు మరమ్మతులు చేపట్టలేదని ఈ విషయాన్ని ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించామని అయినా మరమ్మతులు చేపట్టలేదన్నారు. అగళి నుంచి శిరకు బస్సు, ద్విచక్రవాహనాలు రాకపోకలు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. బస్సు ఎక్కాలన్నా దిగాలన్నా హైవేకి పోవాల్సిన పరిస్థితి. ప్రజాప్రతినిధులు, అధికారులు వెంటనే స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేపట్టి రాకపోకలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అలాగే అనుమనపల్లి గ్రామం వద్దకూడా కల్వర్టు తెగిపోయిందన్నారు.

నాలుగేళ్లుగా ఇబ్బంది పడుతున్నాం



ఇరిగేపల్లి వద్ద తెగిన కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాలి. నాలుగేళ్లుగా శిర మీదుగా వెళ్లేందుకు ఇరిగేపల్లి వద్ద తెగిన కల్వర్టుకు మరమ్మతులు చేపట్టకపోవడంతో బస్సులు రాకపోకలు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కల్వర్టుకు మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది. -గోవిందప్ప, పూల వ్యాపారి

మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయండి



తహసీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించిన విద్యార్థి సంఘం నాయకులు

లేపాక్షి, సెప్టెంబరు 26: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ముందు విద్యార్థులతో కలిసి బైఠాయించి నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థులు వస్తున్నారని వారు మధ్యాహ్నం భోజనం లేక అవస్థలు పడుతున్నారన్నారు. అనంతరం రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అందించారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ



రికార్డులు పరిశీలిస్తున్న నాగమల్లేశ్వరి

గోరంట్ల, సెప్టెంబరు 26: మండలంలోని భూగానిపల్లి, ఎం. కొత్తపల్లిలోని అంగన్‌వాడీకేంద్రాలను ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ నాగమల్లేశ్వరి గురువారం తనిఖీ చేశారు. సెంటర్‌లోని రికార్డులను పరిశీలించి స్టోర్ గదిని తనిఖీ చేశారు. విద్యార్థులు, గర్భవతులు, బాలింతలతో సెంటర్ నిర్వహణపై ఆరా తీశారు. ఆమెతోపాటు సూపర్‌వైజర్ రజిత, అంగన్‌వాడీ కార్యకర్తలు సురేఖ, కమలమ్మ ఉన్నారు.

ఆవుదూడల స్వాధీనం



పట్టుపడిన ఆవుదూడలను పరిశీలిస్తున్న సీఐ శేఖర్

గోరంట్ల, సెప్టెంబరు 26: పట్టణంలోని మార్కెట్‌యార్డులో నిర్వహిస్తున్న పశువుల సంతలో కబేళాలకు కొనుగోలు చేసిన 8 ఆవు దూడలను సీఐ శేఖర్ గురువారం స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటకలోని బెంగుళూరుకు గోరంట్ల పశువుల సంతలో కొనుగోలు చేసినపశువులను వధించి, మాంసాన్ని గూడ్సు వాహనాల్లో తరలిస్తుండగా పోలీసులు ఇటీవల పట్టుకున్నారు. అయినా మండలంలోని పులేరు రోడ్డులోని పొలం వద్ద వధశాల ఏర్పాటు చేసి, నిరంతరం మాంసాన్ని తరలిస్తుండగా గతవారం సీఐ దాడి చేసి ఐదు గూడ్సు వాహనాలతోపాటు 8మందిపై కేసు నమోదుచేసి, నలుగురిని అరెస్టుచేసి, మిగిలినవారి కోసం గాలిస్తున్నారు. సీఐ గోవధపై తీవ్ర చర్యలు చేపడుతున్నా వ్యాపారుల్లో మార్పు రాకపోవడంతో పోలీసులు పశువుల సంతలో తనిఖీలు నిర్వహించారు. ఒక చెట్టుకు 8 ఆవు దూడలను కట్టి ఉంచగా, పోలీసులు గుర్తించారు. ఆవు దూడలు తమవేనంటూ ఎవరూ ముందుకు రాకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకుని చెన్నేకొత్తపల్లి మండలం కోనలోని గోశాలకు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు. గో మాంసాన్ని అక్రమంగా కర్ణాటకకు తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అర్ధరాత్రి పూజలు

● జంతుబలిపై కేసు నమోదు

హిందూపురం, సెప్టెంబరు 26: కంప్యూటర్ యుగంలోనూ మూఢనమ్మకాలు వీడట్లేదు. హిందూపురం మండలం జీవ్‌మాకులపల్లికి చెందిన హనుమంతప్ప, అతడి కుమారుడు గిరీష్ ద్విచక్రవాహనంలో ఈనెల 2న ఉదయం పొలం వద్దకు వెళ్లారు. పనులు ముగించుకుని తిరిగి ఇంటికెళ్తుండగా లేపాక్షి మండలం పులమతి రోడ్డులో వెనుకవైపు నుంచి బుల్లెట్ వాహనం ఢీకొంది. దీంతో హనుమంతప్ప తలకు బలమైన గాయమై, కోమాలోకి వెళ్లాడు. అతడి కుమారుడు గిరీష్.. ఓ పూజారిని సంప్రదించగా.. ప్రమాదస్థలంలో పూజలు చేయిస్తే నయం అవుతుందని చెప్పాడు. ఆ మేరకు కర్ణాటక రాష్ట్రం చింతామణికి చెందిన మునియప్ప అనే మాంత్రికుడి ద్వారా ఈనెల 24న అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో రోడ్డు ప్రమాద ప్రాంతంలో పూజలు చేశారు. భయానక బొమ్మను తయారుచేసి, జంతుబలి ఇచ్చాడు. మరుసటిరోజు అటుగా వెళ్లేవారు నడిరోడ్డుపై పూజలు చేయడం, అక్కడున్న భయానక బొమ్మ, రక్తం పడి ఉండడాన్ని చూసి భయభ్రాంతులకు లోనయ్యారు. దీనిపై డీఎస్పీ మహేష్‌ను అడగ్గా.. దేవుని పేరు చెప్పి ఇలాంటి వాటికి పాల్పడితే మాంత్రికులైనా, తాంత్రికులైనా చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. జంతుబలి ఇవ్వడంతో కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు.

మిద్దెపై నుంచి పడి వ్యక్తికి తీవ్రగాయాలు

పెనుకొండ రూరల్, సెప్టెంబరు 26: పట్టణంలోని కోనాపురంలో మిద్దెపై నుంచి పడి బండారు సోమశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం సాయంత్రం చోటుచేసుకుంది. ఇంట్లో టీవీ రాలేదని బండారు సోమశేఖర్‌రెడ్డి డిష్‌వైరును సరిచేయడానికి సమీపంలోని ఇంటిపైకి ఎక్కాడు. ప్రమాదవశాత్తు పైనుంచి జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి 108కు సమాచారం అందించారు. ఎంతసేపటికీ 108 రాకపోవడంతో ఆటోలో బాధితుడిని తరలించగా మార్గమధ్యలో 108వాహనం ఆపి ఎక్కించుకుని ఆసుపత్రికి తరలించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో డ్యూటీ డాక్టర్ కూడా లేకపోవడంతో ఆసుపత్రి సిబ్బందే చికిత్సను అందించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు.

ఆటో బోల్తా.. ఐదుగురికి గాయాలు

గోరంట్ల, సెప్టెంబరు 26: మండలంలోని సింగిరెడ్డిపల్లి సమీపంలో ఆటో బోల్తా పడిన ఘటనలో ఐదుగురు గాయపడ్డారు. గోరంట్లనుంచి గంగాదేవిపల్లికి గురువారం వెళ్తుండగా సింగిరెడ్డిపల్లి సమీపంలో కుక్క అడ్డురావడంతో ఆటో బోల్తాపడింది. గంగాదేవిపల్లికి చెందిన వృద్ధ దంపతులు మోపిరెడ్డి, లక్ష్మీదేవి, అదే గ్రామానికి చెందిన సువర్ణ, ఆటో డ్రైవర్ నంజుడప్ప, గోరంట్లకు చెందిన సరోజమ్మ తీవ్రవంగా గాయపడ్డారు. గాయపడిన వీరిని గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, డాక్టర్ ఉషా చికిత్సలు చేసి మెరుగైన వైద్యం కోసం 108లో వారిని హిందూపురం తరలించారు ప్రమాదం గురించి వైద్యసిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

హిందూపురం(పరిగి), సెప్టెంబరు 26: మండలంలోని బిందూనగర్‌కు చెందిన దొడ్డప్ప అనే వ్యక్తి నుంచి 68 కర్ణాటక టెట్రా ప్యాకెట్ల మద్యాన్ని గురువారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ రంగడు తెలిపారు. కర్ణాటక ప్రాంతం నుంచి అక్రమంగా మద్యం తరలించి బిందునగర్‌లో విక్రయిస్తుండగా గుర్తించిన పోలీసులు దాడులు నిర్వహించి దొడ్డన్నపై కేసు నమోదుచేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

మడకశిర రూరల్, సెప్టెంబరు 26: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కల్లుమర్రి డాక్టర్ మాధుర్య, మలేరియ సబ్ యూనిట్ ఆఫీసర్ షమీఉల్లా అన్నారు. గురువారం మండలంలోని ఉప్పిడిపల్లి గ్రామంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శి ఆనంద్ కుమార్, హెల్త్ సూపర్‌వైజర్, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉప్పిడిపల్లిలో డ్రైనేజీని శుభ్రం చేయిస్తున్న అధికారులు